మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో,
పెన్ పవర్, నవంబర్ 2:

అవును మియాపూర్ 550 ఎకరాలు, రూ.50-60 వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూములు కాపాడిన విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్‌ను అభినందించాలి.. కానీ పక్కనే ఉన్న దుండిగల్-గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227లో మొత్తం 353.35 ఎకరాలు "సర్కారీ పోరంబోకు" భూమిగా 3 సార్లు కలెక్టర్‌లు వెల్లడించిందే.. సుమారు రూ.40 వేలకోట్లు ఉంటుంది.. ఈ ప్రభుత్వ భూమి హైకోర్టు పరిధిలో ఉండగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2022-2023లో సీసీఎల్ఏ కమిషనర్ అండతో, ఇద్దరు కలెక్టర్‌లు- ఇద్దరు తహశీల్దార్‌లు చేసిన తప్పుడు ధరణీ రిజిస్ట్రేషన్‌లు ఎందుకు రద్దు చేయడంలేదనే అంశాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. 550 ఎకరాలు కాపాడామని, సుప్రీంకోర్టులో విజయం సాధించామని, పత్రికా సమావేశాలతో సంతోషాన్ని పంచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బహుదూర్‌పల్లి సర్వే నెం.227 సర్కారీ పోరంబోకు భూమి 353.35 ఎకరాలు కాపాడటంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. పలుకుబడి ఉన్న ఖరీదైన కబ్జాదారులు అయినందునే ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారా..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. "అక్కడ 550 ఎకరాలు-ఇక్కడ 354 ఎకరాలు" వ్యత్యాసం 200 ఎకరాల లోపే..! అయినప్పటికీ మియాపూర్ భూములతో గొప్పలు చెప్పుకునే నాయకులు.. బహుదూర్‌పల్లిలో మాత్రం నిర్లక్ష్యం దేనికి..? తప్పుడు ధరణీ రిజిస్ట్రేషన్‌లు తక్షణమే రద్దుచేసి సర్కారీ పోరంబోకు భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు..

- బహుదూర్‌పల్లి సర్వే నెం 227 మొత్తం 353.35 ఎకరాలు 1949 నుండీ సర్కారీ పోరంబోకు భూమిగానే..!
- 2004లో ప్రభుత్వ భూమిగా ఆధారాలతో బహుదూర్‌పల్లి సర్పంచ్ శివునూరి సుజాతా కేసులో "ఇంప్లీడ్"..!
- రెవెన్యూ సంబంత వ్యవహారం అయినందున 2004లో హైకోర్టు ఆదేశానుసారం కలెక్టర్ విచారణ షురూ..
- 2009. సెప్టెంబర్ 9న రంగారెడ్డి జిల్లా అప్పటి జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ రావు ప్రభుత్వ భూమిగా ప్రాసీడింగ్..
- వెంటనే అప్రమత్తం అయిన సాయినాథ్ సాసైటీ సభ్యులు, చర్యలు తీసుకోకుండా స్టేటస్‌కో(యధాస్థితికి) ఆర్డర్..
- ఆతర్వాత 2024 అక్టోబర్ 30న మళ్ళీ కలెక్టర్ విచారణకు ఆదేశించిన హైకోర్టు.. మళ్ళీ విచారణ ప్రారంభం..
- అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు ఏడాదిపాటు ఇయరింగ్స్ కొనసాగింపు..
- 2025 అక్టోబర్ 29న పలు అంశాలను పేర్కొంటూ "సర్కారీ పోరంబోకు" భూమిగా నిర్ధారించి తీర్పు..
- బహుదూర్‌పల్లి 227 మొత్తం 353.35 ఎకరాలు.. పట్టా భూమిగా ఎక్కడా ఆధారాలు లేవని తీర్పు వెల్లడి..

- మియాపూర్‌లో రూ.60 వేలకోట్లు విలువైన 550 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన రేవంత్ సర్కార్..
- బహుదూర్‌పల్లిలో రూ.40 వేలకోట్లు విలువైన సర్వే నెం.227లో 353.35 ఎకరాలపై నిర్లక్ష్యం దేనికి..?
- 2025 అడిషనల్ కలెక్టర్ విచారణలో సాయినాథ్ సాసైటీ వద్ద ఆధారాలు నిరాధారమైనవి అంటూ తీర్పు..
- చేతులు కాలాక ఆకులు పట్టుకో వద్దంటున్న ప్రజలు.. మూడుసార్లు 227 ప్రభుత్వ భూమిగా నిర్ధారణ..
- 2022-23లో నోషనల్ ఖాతా పేరుతో 200 ఎకరాలు దుండిగల్ తహశీల్దార్‌లు ధరణీ రిజిస్ట్రేషన్‌లు పూర్తి..
- ధరణీలో ఇళ్ళ స్థలాలుగా ఎంట్రీ.. ఆతర్వాత ధరణీ రిజిస్ట్రేషన్‌లు, పట్టా పాసు బుక్కులు, నాలా కన్వర్షన్‌లు..
- ఈ వ్యవహారంలో సీసీఎల్ఏ కమిషనర్ సహా ఇద్దరు కలెక్టర్‌లు, ఇద్దరు తహశీల్దార్‌లు మిషన్ కంప్లీట్..
- ఈ అక్రమ ధరణీ రిజిస్ట్రేషన్‌లే సాయినాథ్ సాసైటీకి ఆయుధంగా మారాయా..?
- హైకోర్టులో మధ్యంతర ఉత్తర్వులు పొందటానికి, కోర్టును తప్పుదోవ పట్టించారా..? అన్న అనుమానాలు వ్యక్తం..
- అధికారులు చేసిన తప్పుడు ధరణీ రిజిస్ట్రేషన్‌లకు.. 353.35 ఎకరాల ప్రభుత్వ భూమికి వేటు పడిందా..?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 సర్కారీ పోరంబోకు భూమిని కాపాడాలని విజ్ఞప్తి..


వివరాలు 4లో..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

బహుదూర్‌పల్లిలో..!

354 ఎకరాలు..! రూ.40 వేలకోట్లు..!

సర్వే నెం.227 "సర్కారీ పోరంబోకు" భూమి అన్యాక్రాంతం అవుతుంది.. అప్రమత్తంగా ఉండండి..!



ఈ ఇమేజ్ ఏఐ ఊహాజనిత చిత్రం మాత్రమే..

ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లకు
అడ్డుకట్ట వేయండి

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరిన చిరంజీవి



హైదరాబాద్ పెన్ పవర్: సినీ పరిశ్రమకు ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లతో తీవ్ర నష్టం జరుగుతోందని దీనికి అడ్డుకట్ట వేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సినీనటుడు చిరంజీవి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మహాపాద యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన అమిత్‌షాను బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్ కలిశారు. ఈ భేటీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఉన్నారు. ఈ వివరాలను చిరంజీవి, రామ్‌చరణ్‌లు 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను అమిత్‌షాకు వివరించారు.ఏఐ, డీప్‌ఫేక్‌తో సినీపరిశ్రమలో కళాకారుల హక్కులు, గౌరవానికి భంగం వాటిల్లుతోందని, క్రియేటివ్ కంటెంట్‌కు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అమిత్‌షా సానుకూలంగా స్పందించారని, లిఖిత పూర్వకంగా వినతిపత్రం సమర్పించాలని సూచించారని, ఈ బాధ్యతను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అప్పగించారని చిరంజీవి వెల్లడించారు.

అమిత్‌షా చొరవతో త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభించి.. కళాకారులకు తగిన రక్షణ లభిస్తుందని చిరంజీవి ఆశాభావం వ్యక్తం చేశారు. మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, నిర్మాత అభిషేక్ కూడా అమిత్‌షాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు..!
చక్రం తిప్పేదే అధికారులా..?

-గాగిల్లాపూర్ సర్వే నెం.214లో..! దుండిగల్ సర్వే నెం.453, 454 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు..
-దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకునే ధోరణిలో రెవెన్యూ అధికారులు అంటూ వ్యంగ్యారోపణలు..?



దుండిగల్ సర్వే నెంబర్ 453,454 ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణం..

-5లో

- గాగిల్లాపూర్ సర్వే నెం.214లో 2018-19లోనే తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ రేణుక 11 హెచ్చరిక బోర్డులు ఏర్పాటు..
- ప్రస్తుతం ఆ ప్రభుత్వ బోర్డులు, స్థలాలకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లు ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్నారు..
- మరోవైపు దుండిగల్ రెవెన్యూ అధికారులకు కలిసొచ్చిన పాత పట్టాల ప్రక్రియతో అక్రమ కట్టడాల దందా..?
- పాత పట్టాల పేరుతో గాగిల్లాపూర్‌లో అక్రమ కట్టడాల వ్యవహారంపై స్థానికుల ఆగ్రహం..?
- అవగాహన లేని అధికారుల విధుల్లో, అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు..?
- దుండిగల్-గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమా..? ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనా..?
- అక్టోబర్ 14న 'జపిహో' వీరేశం కళ్ళెదుటే అక్రమ నిర్మాణ పనుల వద్ద ప్రశ్నించిన స్థానికులు..
- ఓ అధికారితో ఒప్పందం తర్వాతే..! గాగిల్లాపూర్ 214 అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇస్తున్నారట..?
- ప్రభుత్వ భూముల పరిరక్షణ.. అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసమే 'జీపిహో"ల నియామకం అన్నారు..
- భూదాన్ భూమిలో అక్రమ షెడ్లు.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు.. ఇదేనా పరిరక్షణ-నియంత్రణ..
- ఆర్ఐ రవికుమార్ కూల్చేసిన భారీ షెడ్డు మళ్ళీ ఎలా నిర్మించారు..? ముడుపులే కారణమా..?

- దుండిగల్-గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమిపై రెవెన్యూ నిర్లక్ష్యం..?
- దాదాపు 25 ఏళ్ళుగా తెలంగాణ హైకోర్టు పరిధిలో ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో కబ్జాలు, తప్పుడు రిజిస్ట్రేషన్‌లు..!
- 2001లో రెవెన్యూ 'ఎన్‌వోసి' కోసం నాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్న సాయినాథ్ సొసైటీ..
- సొసైటీ అభ్యర్థన మేరకు 25 క్రితం "సీసీఎల్ఏ కమిషనర్" దృష్టికి తీసుకెళ్ళిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్..
- 2001లో అప్పటి రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.సి.నెం..ఈ/206/2001,ద్వారా కీలక సర్క్యులర్ జారీ..
- రెవెన్యూ ఎన్‌వోసి జారీ చేసేవరకు రిజిస్ట్రేషన్‌లు చేయొద్దని సబ్‌రిజిస్టార్‌లకు ఆదేశాలు..
- ఈ సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ సాయినాథ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ 2002లో డబ్ల్యు.పి.నెం.1953 దాఖలు..
- విచారణ చేపట్టిన హైకోర్టు 18-12-2003న సొసైటీకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది..
- జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఆర్.సి నెం.ఈ/206/2001 సర్క్యులర్ ఆదేశాలను కూడా రద్దు చేసింది..
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యు.పి.నెం.1133 ఆఫ్ 2004 ద్వారా రిట్ అప్పీల్..
- ఈ అప్పీల్‌ను 29-08-2004న డివిజన్ బెంచ్ కొట్టివేసింది..
- హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో రిజిస్ట్రేషన్ 'చట్టం-1908లోని సెక్షన్ 22-ఎ'లో పెట్టడాన్ని కోర్టు అడ్డుకోబోదని స్పష్టం..
- సర్వే నెంబర్ 227కు సంబంధించి 22-ఎ నిషేధిత జాబితా అంశం 2004 నుంచే అమల్లో ఉన్నట్టు స్పష్టం..



బహుదూర్‌పల్లిలో..! 354 ఎకరాలు..!

రూ.40 వేలకోట్లు..!



అదనపు కలెక్టర్ తీర్పుపై.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు..

తెలంగాణ హైకోర్టు 2024 అక్టోబర్ 30న జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం..ఏడాదిపాటు విచారణ జరిపిన, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్, విజయేందర్‌రెడ్డి, సర్వే నెం.227 మొత్తం 353.35 ఎకరాలు, సర్కారీ పోరంబోకు భూమిగా, 2025 అక్టోబర్ 29న తీర్పును ప్రకటించారు.. దీంతో ఇప్పుడు బహదూర్‌పల్లి గ్రామ శివారు సర్వే నెంబర్ 227 భూమికి సంబంధించిన వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది.. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) 29-10-2025న కేసు నెంబర్: ఈ1/229/2024లో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ, సాయినాథ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ డబ్ల్యు.పి.నెం.36272 ఆఫ్ 2025 దాఖలు చేసింది.. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, వివాదాస్పద ఉత్తర్వుల అమలును మధ్యంతరంగా సస్పెండ్ చేస్తున్నట్టు ఆదేశాలు జారీ చేసింది..

ఈనెల(నవంబర్)11కు వాయిదా.. కౌంటర్ దాఖలుకు ఆదేశం..

హైకోర్టు ఆదేశానుసారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, 2025 అక్టోబర్ 29 నాటి తీర్పును, సవాల్ చేస్తూ సాయినాథ్ సొసైటీ తరపు వకీల్ హైకోర్టులో అభ్యంతరాలు వ్యక్తం చేశారు.. దీంతో పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న ఉన్నత న్యాయ స్థానం 2025 డిసెంబర్ 10న మధ్యంతర ఉత్తర్వులు (ఇంటరిమ్ ఆర్డర్) జారీచేస్తూ, 2026 జనవరి 1వ తేదీకి వాయిదా వేసింది.. ఆతర్వాత 3 వాయిదాలు ఇచ్చినప్పటికీ, అభ్యంతరాలు వ్యక్తం చేసిన సాయినాథ్ సొసైటీ, అందుకు గల ఆధారాలను హైకోర్టుకు దాఖలు చేయలేక పోవడంపై, 4వ వాయిదాగా ఈనెల(నవంబర్) 11కు తేదీని ప్రస్తావించినట్లు సమాచారం.. ఈసారైనా కౌంటర్ దాఖలు చేస్తారా..? లేదా అన్నది వేచిచూడాలి..

గత హైకోర్టు ఉత్తర్వుల ప్రస్తావన..

ఇదే భూమికి సంబంధించిన గత వివాదాల నేపథ్యంలో "29-11-2024"న డబ్ల్యు.పి.నెంబర్‌లు.4698, 19425, 19426 ఆఫ్ 2008, 12714 ఆఫ్ 2009, 20907, 22662 ఆఫ్ 2009 కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ఉమ్మడి ఉత్తర్వులను కూడా సొసైటీ తరపు సీనియర్ న్యాయవాది ప్రస్తావించారు. సర్వే నెంబర్లు 227/1, 228 భూముల వర్గీకరణపై సంబంధిత అధికార యంత్రాంగం ప్రాతినిధ్యాన్ని పరిశీలించాలని గతంలో ఆదేశించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు..

డాక్టర్ రెడ్డీస్ బయోసైన్సెస్ ప్రస్తావన..!

అదనపు కలెక్టర్ ముందు జరిగిన అప్పీల్ విచారణలో ప్రతివాదిగా ఉన్న 'డాక్టర్ రెడ్డీస్ బయో సైన్స్ లిమిటెడ్'ను ప్రస్తుత రిట్ పిటిషన్‌లోనూ ప్రతివాదిగా చేర్చాల్సిన అవసరాన్ని కోర్టు ముందు ప్రస్తావించారు. ఈ అంశంపై పిటిషనర్ తరపు న్యాయవాదులు కూడా అభ్యంతరం లేదని తెలిపారు..

సొసైటీ అభ్యంతరాలు ఏమిటి..?

సర్వే నెంబర్ 227లోని భూమి ప్రభుత్వ భూమి కాదని, తమకు సంబంధించిన పట్టా భూమిగా సాయినాథ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. అదనపు కలెక్టర్ తన ఉత్తర్వుల్లో 1951-52 సంవత్సరానికి సంబంధించిన సేత్వార్, పహాణీ రికార్డులను ఆధారంగా తీసుకొని ఆ భూమిని పోరంబోకు భూమిగా పేర్కొన్నారని తెలిపారు.. అయితే సొసైటీ చేస్తున్న పట్టా భూమి వాదనను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే నిర్ణయం తీసుకున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.. ఈ ఉత్తర్వుల వల్ల తమ హక్కులకు భంగం కలుగుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు..

అటు హైకోర్టు పరిధిలో.. ఇటు 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్న బహుదూర్‌పల్లి సర్వే నెం.227 సర్కారీ పోరంబోకు భూమి 353.35 ఎకరాల్లో, నోషనల్ ఖాతాతో దాదాపు 200 ఎకరాలు, రెవెన్యూ అధికారులే బరితెగించి ధరణి రిజిస్ట్రేషన్‌లు చేయడం వివాదస్పదంగా తయారైంది.. హైకోర్టు పరిధిలో ఉండగానే, సర్వే నెం.227 ప్రభుత్వ భూమిపై ధరణీ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ఏ ప్రాతిపదికన చేశారని ప్రశ్నలు లేవనెత్తుతోంది.. కనీసం తమ పొరపాటును కూడా సరిదిద్దుకోకుండా సంబంధిత రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దుండిగల్-గండిమైసమ్మ మండలం, బహుదూర్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నెం.227లో 353.35 ఎకరాల ప్రభుత్వ భూమిపై జరిగిన ధరణి రిజిస్ట్రేషన్లు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. భూమి హైకోర్టు పరిధిలో ఉండటంతో పాటు 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ, 2022-23లో నోషనల్ ఖాతా ఆధారంగా సుమారు 200 ఎకరాలకు పైగా రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.. ఈ వ్యవహారంలో ధరణీ రిజిస్ట్రేషన్‌లపై రెవెన్యూ అధికారుల పనితీరు అనేక అనుమానాలకు తావిస్తోంది.. మరోవైపు హైకోర్టు ఆదేశాలతో ఏడాదికిపైగా విచారణ చేపట్టిన మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్, 2025 అక్టోబర్ 29న వెలువరించిన తుది ఉత్తర్వుల్లోనూ, సర్వే నెం.227లోని మొత్తం 353.35 ఎకరాలను ప్రభుత్వ సర్కారీ పోరంబోకు భూమిగా నిర్ధారించారు.. దీంతో గతంలో ప్రైవేటు వ్యక్తుల పేరిట జరిగిన హక్కుల క్లెయిమ్‌లు, వాటి ఆధారంగా జరిగిన రిజిస్ట్రేషన్ల చట్టబద్ధత ప్రశ్నార్థకంగా మారింది..

ముఖ్యంగా, "నోషనల్ ఖాతా" కేవలం పరిపాలనా ప్రయోజనాల కోసం ఉండే ఎంట్రీ మాత్రమే అయినప్పుడు, దాని ఆధారంగా యాజమాన్య హక్కులు కల్పించే విధంగా ధరణి రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి..? అన్నది కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఒకవైపు 22-ఎ నిషేధిత జాబితాలో, మరోవైపు హైకోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిపై లావాదేవీలకు ఎవరు అనుమతించారు..? సంబంధిత ధరణీ రిజిస్ట్రేషన్‌లు చేసిన రెవెన్యూ అధికారులు నిబంధనలను పరిశీలించారా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.. అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఉత్తర్వుల నేపథ్యంలో కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. 2022-23లో జరిగిన రిజిస్ట్రేషన్లపై సమగ్ర సమీక్ష చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన లావాదేవీలను చట్టప్రకారం రద్దు చేయడంతో పాటు, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ధరణి రిజిస్ట్రేషన్ల పారదర్శకతకు ఈ వ్యవహారం కీలక పరీక్షగా మారింది..


హైకోర్టు కీలక ఆదేశాలు..!

కేసులో లేవనెత్తిన అంశాలను ప్రభుత్వ అధికారుల కౌంటర్ అఫిడవిట్ దాఖలైన తర్వాత నిర్ణయించాల్సి ఉందని అభిప్రాయపడిన హైకోర్టు, అప్పటివరకు మధ్యంతర ఉపశమనం కల్పించింది. అదనపు కలెక్టర్ 29-10-2025న కేసు నెంబర్ 'ఈ1/229/2024'లో జారీ చేసిన ఉత్తర్వుల అమలు కాకుండా సస్పెండ్ చేస్తూ, 2025 డిసెంబర్ 10న హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.. తదుపరి విచారణను డబ్ల్యు.పి.నెం.37486 ఆఫ్ 2025తో కలిపి 22-01-2026న విచారణలో కౌంటర్ దాఖలు చేయాలని ఇరు వర్గాలను కోర్టు ఆదేశించింది.. ముఖ్యంగా హైకోర్టు ప్రస్తుతం అదనపు కలెక్టర్ ఉత్తర్వుల అమలును మాత్రమే మధ్యంతరంగా నిలిపివేసిందని, సర్వే నెంబర్ 227 భూమి పట్టా భూమా..? ప్రభుత్వ భూమా..? అనే అంశంపై తుది తీర్పు వెలువడలేదని, భూమి యాజమాన్యంపై సొసైటీ వాదనను కోర్టు ఇంకా ఆమోదించినట్లు కాదని ఆర్డర్‌లో ప్రస్తావించింది..

అడిషనల్ కలెక్టర్ విచారణలో వెలుగులోకి కీలక నిజాలు..

బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో, ప్రభుత్వానికి మరికొన్ని కీలక ఆధారాలు లభించాయి.. విచారణలో భాగంగా, ఈ కేసులో 2004లోనే ఇంప్లీడ్ అయిన బహుదూర్‌పల్లి విలేజ్ మాజీ సర్పంచ్ శివునూరి సుజాతా శ్రీహరి దాఖలు చేసిన ఆధారాలతో సర్వే నెంబర్ 227 మొత్తం 353.35 ఎకరాలు "సర్కారీ పోరంబోకు" భూమిగా నిర్ధారించే ఆధారాలు సమర్పించడం కేసు మలుపు తిరిగింది.. 2024 అక్టోబర్ 30న హైకోర్టు ఆదేశాలతో, జిల్లా అడిషనల్ కలెక్టర్ విచారణలో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.. 1966లో నంబూరి కుటుంబం, బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 భూమి విక్రయాలు, రిజిస్ట్రేషన్‌లు బాగానే మేనేజ్ చేసినప్పటికీ.. అసలు నంబూరి కుటుంబీకులకు 227 భూమి ఎవరు విక్రయించారు..? ఎక్కడి నుండి వచ్చింది..? అన్నది సంబంధిత మదర్ డాక్యుమెంట్లు లేవని తేలింది..? బహుశా 1966లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కూడా ఈ విషయం తెలుసో తెలియదో కానీ.. ఉర్దూ పత్రాల అనువాదంతో 227 భూ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని శివునూరి సుజాతా శ్రీహరి పేర్కొన్నారు.. అసలు నంబూరి కుటుంబం కొనుగోలు చేసినది సర్వే నెంబర్ 228, 52 పట్టా భూమి 01-27 (ఒక ఎకరా ఇరవైపడు గుంటలు మాత్రమే కొనుగోలు చేశారని, అసలు 227 ఎవరికీ విక్రయించలేదని ఉర్దూ డాక్యుమెంట్‌ల అనువాదంలో బయటపడింది..






ప్రభుత్వ భూమిలోని కాంపౌండ్ లోపల నిర్మించిన రూము..

దుండిగల్ సర్వే నెంబర్ 453,454 ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణం..

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు..!

చక్రం తిప్పేది అధికారులా..?

- గాగిల్లాపూర్ సర్వే నెం.214లో..! దుండిగల్ సర్వే నెం.453, 454 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు..
- దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకునే ధోరణిలో రెవెన్యూ అధికారులు అంటూ వ్యంగ్యారోపణలు..?



గాగిల్లాపూర్ సర్వే నెం.214లో గతనెల (అక్టోబర్) 14న అక్రమ నిర్మాణం.. పక్కనే జిపివో వీరేశం..



రెవెన్యూ అధికారుల అండతో.. అక్రమ నిర్మాణం పూర్తయిన చిత్రం.. ప్రస్తుత ఫొటో..

రెవెన్యూ అధికారుల విధుల ఉద్దేశం ఏమో తెలియదు కానీ..! అధికారుల బరితెగించి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా..? ప్రభుత్వ భూముల పరిరక్షణ మాత్రం గాలికి వదిలేశారని తేటతెల్లం అవుతుంది.. దుండిగల్ గ్రామ సర్వే నెంబర్ 453, 454 ప్రభుత్వ భూమిలో, అధికార పార్టీ ముసుగులో, ఓ కబ్జాదారుడు నిర్మించిన అక్రమ నిర్మాణం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. సంబంధిత స్థలాన్ని స్వయంగా తహశీల్దార్, ఓవైపు "భూ సేకరణకు" గ్రామ సభలు, అసైనీ రైతులతో సమావేశాలు నిర్వహించి, ఆర్డీవో సమక్షంలోనే రైతులను ఒప్పించి మరీ "ల్యాండ్ పూలింగ్" ప్రక్రియను వేగవంతం చేసిన అదే స్థలంలో..! అధికారుల అభిమాన కబ్జాదారుడు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. మరోవైపు గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 214 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల దందా ఊపందుకుంది.. అక్రమ నిర్మాణ దారులు కూడా సార్లతో మాట్లాడుకున్నాకే పనులు చేస్తున్నారట..? ఈ వ్యవహారంలో జిపివో కీలకపాత్ర పోషిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. కబ్జాదారులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలు, జీపివో దగ్గరుండి కట్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

దుండిగల్, పెన్ పవర్, నవంబర్ 2:



గాగిల్లాపూర్ సర్వే నెం.214 ప్రభుత్వ భూమిలో.. 2018-19లో రెవెన్యూ హెచ్చరిక బోర్డులు.. ఫెన్సింగ్‌లు..





- దుండిగల్ గ్రామం సర్వే నెం.453, 454 అసైన్డ్ భూములు "భూ సేకరణ"కు సమీక్షలు, సమావేశాలు..
- అసైనీ రైతులను తహశీల్దార్ ఆధ్వర్యంలోనే కష్టపడి ఒప్పించిన మల్కాజిగిరి ఆర్డీవో..
- 'భూ సేకరణ'ను నీరుగార్చే విధంగా భూ కబ్జాదారులను ప్రోత్సహిస్తున్న దుండిగల్ రెవెన్యూ అధికారులు..
- పల్లవి ఆశ్రమం వెనుక అక్రమ నిర్మాణంపై చర్యలేవి..? కబ్జాలకు కమిట్‌మెంట్ ఇచ్చారా..?
- కూల్చాలా వద్దా అన్న సందిగ్ధంలో రెవెన్యూ అధికారులు ల్యాండ్ పూలింగ్ దశలో ఉన్న స్థలంపై ఇంత నిర్లక్ష్యమా..?

- గాగిల్లాపూర్ సర్వే నెం.214లో 2018-19లోనే తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ రేణుక 11 హెచ్చరిక బోర్డులు ఏర్పాటు..
- ప్రస్తుతం ఆ ప్రభుత్వ బోర్డులు, స్థలాలకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లు ఎక్కడ అంటూ ప్రశ్నిస్తున్నారు..
- మరోవైపు దుండిగల్ రెవెన్యూ అధికారులకు కలిసొచ్చిన పాత పట్టాల ప్రక్రియతో అక్రమ కట్టడాల దందా..?
- పాత పట్టాల పేరుతో గాగిల్లాపూర్‌లో అక్రమ కట్టడాల వ్యవహారంపై స్థానికుల ఆగ్రహం..?
- అవగాహన లేని అధికారుల విధుల్లో, అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు..?
- దుండిగల్-గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమా..? ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనా..?
- అక్టోబర్ 14న 'జిపివో' వీరేశం కళ్ళెదుటే అక్రమ నిర్మాణ పనుల వద్ద ప్రశ్నించిన స్థానికులు..
- ఓ అధికారితో ఒప్పందం తర్వాతే..! గాగిల్లాపూర్ 214 అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇస్తున్నారట..?
- ప్రభుత్వ భూముల పరిరక్షణ.. అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసమే 'జీపివో"ల నియామకం అన్నారు..
- భూదాన్ భూమిలో అక్రమ షెడ్లు.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు.. ఇదేనా పరిరక్షణ-నియంత్రణ..
- ఆర్ఐ రవికుమార్ కూల్చేసిన భారీ షెడ్డు మళ్ళీ ఎలా నిర్మించారు..? ముడుపులే కారణమా..?

గతంలో విఆర్వోల వ్యవస్థనే లేకుండా ఇతర శాఖల్లో విలీనం చేసినప్పటికీ..! ప్రభుత్వ భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసం 'జీపివో'లుగా విఆర్వోల ఈ-ఎంట్రిపై, దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి చాలా గొప్పగా చెప్పారు..! అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అక్రమ కట్టడాలు దగ్గరుండి సహకరిస్తున్నారని గాగిల్లాపూర్ వాసులు నిరూపించారు.. సంబంధిత విషయాన్ని తహశీల్దార్, ఆర్ఐ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన చెందారు.. దుండిగల్-గండిమైసమ్మ మండలం గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 214 ప్రభుత్వ భూమిలో గతనెల (అక్టోబర్) 14న పాత పట్టాల మాటున నిర్మిస్తున్న అక్రమ కట్టడాల వద్ద జిపివో వీరేశం ఉండటంపై అనుమానాలు వ్యక్తం చేశారు.. అందుకు బలం చేకూరే విధంగా, సంబంధిత అక్రమ నిర్మాణం, కమర్షియల్ షట్టర్లతో పూర్తి కావడం, స్థానికులు చెప్పిందే నిజమని రుజువైంది.. మరో 4-5 ప్లాట్‌లలో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం..దుండిగల్-గండిమైసమ్మ మండలం గాగిల్లాపూర్ సర్వే నెంబర్ 214 ప్రభుత్వ భూమిలో, కబ్జాల కట్టడికి, అక్రమ నిర్మాణాల నియంత్రణకు 2018-19 లోనే, తహశీల్దార్ మల్లయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు.. దాదాపు ఏడెనిమిది సంవత్సరాల క్రితమే, తహశీల్దార్ మల్లయ్య ఆదేశాలతో, నాటి ఆర్ఐ రేణుక, సుమారు 11 రెవెన్యూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.. ఖాళీస్థలాలకు ముళ్ళకంచెతో ఫెన్సింగ్‌ను కూడా పెట్టారు.. ఈ ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులను ఫొటోలు, వీడియోలు తీయించి, భద్రపరిచినట్టు సమాచారం.. ప్రస్తుతం ఆ ముళ్ళ కంచెలు పోయాయి.. ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు కనిపించడం లేదు.. ప్రస్తుతం విధుల్లో ఉన్న తహశీల్దార్, ఆర్ఐ లకు, పాపం ఈ విషయం తెలియకనే, పాత పట్టాలు ఉన్నాయని ప్రశ్నించిన వారికి చెపుతున్నారా.. అనిపిస్తుంది..? కోట్లు విలువైన ప్రభుత్వ భూములు కబ్జాదారులకు కట్టబెట్టి పట్టాల డ్రామాను రక్తికట్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు..

అసైన్డ్ భూమిలో..అధికారపార్టీ నాయకుని అక్రమ నిర్మాణం..

ఓవైపు అసైనీ రైతుల నుండి భూ సేకరణకు గ్రామ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు.. చివరికి రైతులను ఒప్పించి ఓ నిర్ణయానికి వచ్చిన అదే భూమిలో, వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు అధికారుల వైఫల్యాన్ని వెక్కిరిస్తోంది.. ఈ అక్రమ నిర్మాణం వ్యవహారం సంబంధిత రెవెన్యూ అధికారుల అండతోనే జరుగుతుందనే విమర్శలు లేకపోలేదు.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, దుండిగల్-గండిమైసమ్మ మండలంలో ప్రభుత్వ భూములకు నిజంగా భద్రత లేదని నిరూపించారు.. దుండిగల్ సర్వే నెంబర్ 453, 454 ప్రభుత్వ అసైన్డ్ భూమిలో ఓ కబ్జాదారుడు నిర్మించిన అక్రమ నిర్మాణంపై పత్రికల్లో వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు, దున్నపోతు మీద వర్షం పడిన చందంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ ప్రభుత్వ అసైన్డ్ భూమిని, భూ సేకరణలో భాగంగా దుండిగల్ గ్రామ అసైనీ రైతులతో పలుమార్లు సమావేశాలు, గ్రామసభలు నిర్వహించి ఒప్పించారు.. ఇదంతా స్థానిక తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్ ఆధ్వర్యంలోనే "ల్యాండ్ పూలింగ్" సమావేశాలు నిర్వహించారు.. ఇపుడు అదే ప్రభుత్వ భూమిలో, దుండిగల్-గండిమైసమ్మ మండలం తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఓ కబ్జాదారుడు అక్రమంగా గదిని నిర్మించి చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడం అవినీతి అధికారుల తీరు బట్టబయలు చేస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి..

- విద్యార్థుల విద్యాభివృద్ధికి వాసవి క్లబ్ చేయూత..
- ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ..
- విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ..!



ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, నవంబర్ 2: విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించడమే లక్ష్యంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.. ఇందులో భాగంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ శ్రీ చిత్తరమ్మ గాజులరామారం శాఖ ఆధ్వర్యంలో గాజులరామారంలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే అమూల్యమైన సంపద అని, విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు పడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందించడం ద్వారా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో వాసవి క్లబ్ ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠతో విద్యార్థుల్లో విద్య పట్ల భక్తి, శ్రద్ధ, ఆసక్తి మరింత పెరుగుతాయని ఆకాంక్షించారు.. ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవరశెట్టి జగదీశ్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సిద్ధా సూర్య ప్రకాష్ రావు హాజరయ్యారు.. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి గాంధీ, జనరల్ సెక్రటరీ బొల్లా శ్రీనివాస్, కోశాధికారి శివప్రసాద్, క్లబ్ ప్రతినిధులు వాస శ్రీనివాస్, సోమిశెట్టి పవన్ గుప్తా, ఆకుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..





50 టీఎంసీల వరద..?! 'మురసు'తో నిండనున్న పులిచింతల, నాగార్జునసాగర్

హైదరాబాద్ పెన్ పవర్: మురసు తుఫానుతో రాష్ట్రంలో రాయలసీమ, పల్నాడు జిల్లాలలో నీటి లోటు తీరే పరిస్థితి కనిపిస్తోంది. నెల్లూరు సమీపంలో తీరందాటనున్న మురసు కారణంగా దక్షిణకోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉండగా, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలను తట్టుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక తుఫాను హెచ్చరికలు, భారీ వరదలపై అంచనాలతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి సెక్రటేరియట్ లో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో తిష్ఠ వేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు.



అర్నాబ్ కంటే తక్కువ ప్రభావం

కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్లు అంచనాలు ఉన్నాయని వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు

మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గోళ్లపాడులో కాంగ్రెస్‌కు భారీ బలం బీఆర్ఎస్‌కు షాక్

మంత్రి పొంగులేటి అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై 30 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక

ఖమ్మం,పెన్ పవర్, నవంబర్ 2 ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 30 కుటుంబాలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గ్రామంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు.ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గోళ్లపాడు గ్రామంలో గతంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు మంత్రి పొంగులేటి చొరవతో పూర్తికావడం అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే నాయకత్వానికి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో మరింత మంది కాంగ్రెస్ పార్టీ వైపు అడుగులు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డమీద ఉపేందర్, మాజీ ఉపసర్పంచ్ దొంతిసర్పు రాంబాబు, మాజీ వార్డు సభ్యుడు చీకటిమళ్ల లక్ష్మీనారాయణ, గౌడ సంఘం నాయకుడు మడికంటి శ్రీను, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు రుద్ర మధు, ఎస్సీ నాయకుడు పొన్నెకంటి రాంబాబు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, మద్ది కిషోర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, తేజావత్ పంతులు నాయక్, మద్ది వెంకటరెడ్డి, మందటి వెంకటరెడ్డి, శాబాదు మాధవరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై దేవదేవుడు మారుమోగిన గోవింద నామస్మరణ



స్వామి వారిని దర్శించుకుని పూజలు చేస్తున్న భక్తులు

గార్ల, పెన్ పవర్, నవంబర్: 2 కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు అనంతరం గార్లకు చేరుకున్న శ్రీ భూనీల సమేత వెంకటేశ్వర స్వామివారికి సోమవారం రాత్రి గరుడ వాహన సేవను అంగరంగ వైభవంగా జరిపారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్టించి మేళ తాళాల నడుమ గార్ల పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు గోవింద నామస్మరణతో మారు మోగింది ఆలయ గడప దాటి తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని అధిరోహించిన స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు స్వామివారిని గరుడ వాహనంపై చూసిన భక్తులు కనులారా దర్శించుకుని తన్మయత్వంలో మునిగితేలారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు ఈ సందర్భంగా అర్చకులు అచ్యుత్ ఆచార్య మాట్లాడుతూ స్వామివారికి గరుడ వాహనమంటే మిక్కిలి ఇష్టమని దాస్య భక్తితో కొలిచే భక్తులకు తాను దాసుడినవుతానని గరుడ వాహనం ద్వారా స్వామి వారు తెలియజేస్తున్నాడని మానవులు జ్ఞాన వైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడ వాహనంపై స్వామివారిని దర్శిస్తే సర్వ పాపాలు తొలుగు తాయన్నారు ఈ కార్యక్రమంలో అర్చకులు గోవింద ఆచార్య రాము ఆలయ కార్యనిర్వాక అధికారి సత్యనారాయణ ఆలయ చైర్మన్ అజ్మీరా బన్సీలాల్ వైస్ చైర్మన్ అర్జున గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతి హథిరాం నాయక్ టీటీడీ ధర్మ ప్రచార కమిటీ సభ్యులు రాములు నాయక్ పట్టణ పుర ప్రముఖులు రమేష్ బాబు వేమిశెట్టి శ్రీనివాస్ ఒబిలి శెట్టి కృష్ణ కోటా సంపత్ కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు

తెలంగాణకు 'మురసు' గండం.. మూడు రోజుల పాటు భారీ వర్షాలు

హైదరాబాద్ పెన్ పవర్: బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తుపాను తీవ్రత దృష్ట్యా సోమవారానికి ఆరెంజ్, మంగళవారానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగాలు సిద్ధంగా ఉండాలని సూచించింది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం, ప్రస్తుతం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న మురసు తుపాను, సోమవారం ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా బలపడనుంది. ఇది నవంబర్ 2వ తేదీ అర్ధరాత్రి నుంచి 3వ తేదీ తెల్లవారుజాము మధ్యలో దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు-నర్సాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు.ఈ తుఫాను ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురువనున్నాయి. సోమవారం (నవంబర్ 2) ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఐఎండీ తెలిపింది.మంగళవారం (నవంబర్ 3) ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున రెడ్ అలర్ట్ ప్రకటించారు. అదే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 60-70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, ఎప్పటికప్పుడు తాజా సమాచారం కోసం అధికారిక ప్రకటనలను గమనించాలని సూచించారు.

మల్కారం క్వారీ గుంతలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడిన యువకులు

హైదరాబాద్ పెన్ పవర్: సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందిన విషాద సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కారం క్వారీ గుట్టల్లో చోటుచేసుకుంది.ఆదివారం సెలవు దినం కావడంతో యాప్రాల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు మల్కారం క్వారీ గుట్టల వద్దకు సరదాగా గడిపేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు క్వారీలోని నీటిలోకి దిగిన ఇద్దరు విద్యార్థులు నీటిలో మునిగిపోయారు.మృతులు సీవిఆర్ కాలేజీలో చదువుతున్న రోహిత్ (18), సీఎంఆర్ కాలేజీలో చదువుతున్న సయాన్ (18)గా గుర్తించారు.సమాచారం అందుకున్న జవహర్‌నగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. హైడ్రా, డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించి నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీసేందుకు సిబ్బంది ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇద్దరు విద్యార్థుల మృతితో కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేబుల్ బ్రిడ్జిపై మరో విషాదం.. దుర్గం చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్ పెన్ పవర్:

హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో విషాదం చోటుచేసుకుంది. మాదాపూర్ కేబుల్ బ్రిడ్జి పైనుంచి చెరువులో దూకి 29 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని నల్లగండ్లలోని మీరో అపార్ట్‌మెంట్స్‌లో నివసించే సాయి మహేశ్వర్‌గా పోలీసులు గుర్తించారు. సాయి మహేశ్వర్ శనివారం మధ్యాహ్నం సమయంలో కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువులోకి దూకేశాడు. సమాచారం అందుకున్న వెంటనే మాదాపూర్ పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. అనంతరం అతని మృతదేహాన్ని వెలికితీశాయి. పోలీసుల వివరాల ప్రకారం.. సాయి మహేశ్వర్ గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. ఆ తర్వాత ఉద్యోగం మానేసి కొంతకాలం మొబైల్ షాపు నడిపాడు. ప్రస్తుతం అతను ఖాళీగా ఉంటున్నట్లు తెలిసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలపై విచారణ జరుపుతున్నారు.

కోతుల బెడదకు కొండముచ్చు కాపలా!



కొండముచ్చుతో కోతులను వెళ్లగొడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

గార్ల, పెన్ పవర్, నవంబర్ 2: గార్ల మండల కేంద్రంలో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరాం నాయక్ వినూత్న ప్రయత్నం చేపట్టారు. గ్రామంలోని పలు వీధులు, కాలనీల్లో కోతుల సంచారం పెరిగి ఇళ్లలోకి చొరబడుతూ వస్తువులను చిందరవందర చేయడం, రోడ్లపై గుంపులుగా సంచరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యకు పరిష్కారంగా సర్పంచ్ రెండు కొండముచ్చులను తీసుకొచ్చారు. కొండముచ్చులను గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు వెంట తీసుకొని గార్ల పట్టణంలోని పురవీధుల్లో తిరుగుతుండటంతో కొండముచ్చులను చూసిన కోతులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీస్తున్నాయి. కొండన్న కాపలా తో కోతుల బెడద నుంచి కొంతమేరకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు భావిస్తున్నారు కొండముచ్చులు పోయిన వెంటనే మళ్ళీ ఇళ్లల్లోకి చొరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేరులో భాగ్యం.. తీరులో దౌర్భాగ్యం

అధ్వానంగా పారిశుద్ధ్యం

మౌలిక వసతులు కరువు



నడవడానికి దారి లేకుండా ఆగిన నీళ్లు



బురదమయంగా మారిన రహదారి

గార్ల, పెన్ పవర్, నవంబర్: 2: పేరులో భాగ్యం ఉన్నా.. తీరులో మాత్రం దౌర్భగ్యంగా ఉంది. గార్ల మండల కేంద్రంలోని స్థానిక బసవతారక్ నగర్ వికలాంగుల కాలనీలో ని ప్రధాన రోడ్డు లు బురదమయంగా మారింది చిన్నపాటి వర్షం వచ్చినా చాలు రోడ్డుపై నడవాలంటే నరకయాత పడుతున్నామని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు డ్రైనేజీ కూడా లేక మురుగునీరు రోడ్డు మీద ప్రవహిస్తుందని దీంతో బయట నుంచి ఇంట్లోకి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు దీనికి తోడు పారిశుద్ధ్య సమస్య ఏర్పడడంతో రోడ్డుపైన నిలిచిన మురుగునీరుదోమలకు ఆవాసాలుగా మారి విష జ్వరాలు విజృంభిస్తూ అనారోగ్యం బారిన పడుతున్నామని ఇటీవల కాలంలో డెంగ్యూ కేసు నమోదయిందని. వారు ఆందోళన వ్యక్తం చేశారు ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యం పనులు నిర్వహించిమురుగునీరు తొలగించే ఏర్పాటు చేసి వ్యాధుల బారిన పడకుండా చూడాలని వేడుకున్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు కొచ్చర్ల జక్కులు మృతి జెండా కప్పి ఘన నివాళులు



ఖమ్మం, పెన్ పవర్ నవంబర్ 2 ఖమ్మం రూలర్ ముత్తగూడెం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకులు కొచ్చర్ల జక్కులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతదేహంపై సీపీఐ పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ హమ్మద్ మౌలానా, కొచ్చర్ల గురుస్వామి, గండి నాగయ్య, కొచ్చర్ల రవి, కొచ్చర్ల మైబు, గుదే వీరభద్రం, నాగేల్లి అశోక్, గడదాస్ హరినాథ్ బాబు తదితర సీనియర్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొచ్చర్ల జక్కులు పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తగూడెం గ్రామ సీపీఐ శాఖ కార్యదర్శి దొంతగాని రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు భీమనపల్లి శేఖర్ మృతి

శేఖర్ కు నివాళులర్పించిన డియూడబ్ల్యూజే, ఐజేయు నేతలు

ఎల్బీనగర్, పెన్ పవర్, నవంబరు 2:

ప్రజాశక్తి, సూర్య దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేసిన భీమనపల్లి శేఖర్ గుండెపోటుతో ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. శేఖర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ జే.కిషన్(రాధాకిషన్), జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్లంపల్లి అంజనేయులు, ట్రెజరర్ శశిపాల్ రెడ్డి , సీనియర్ జర్నలిస్టులు బాణాల మధుసూదనాచారి, చాపల శ్రీనివాస్, నర్రి రమేష్, దేవయ్య తదితరులు శేఖర్ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని ఐజేయు నేతలు భరోసా కల్పించారు. నివాళులు అర్పించిన వారిలో పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

ఖమ్మంలో బియ్యం ధరల మంట సామాన్యుడి బతుకు బండి కష్టం

25 కిలోల బస్తాకు రూ.1,900 నుంచి రూ.2,200 వరకు ధర

నిత్యావసరాల భారం మధ్య మరోసారి సామాన్యుడిపై ధరల పిడుగు



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 2 ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండగా, మరోవైపు బియ్యం ధరలు కూడా సామాన్య ప్రజలకు భారంగా మారుతున్నాయి. ఒకప్పుడు కుటుంబానికి సరిపడా బియ్యం కొనుగోలు చేయడం పెద్ద సమస్య కాకపోయినా, ప్రస్తుతం బియ్యం బస్తా ధరలు వింటేనే సామాన్య కుటుంబాలు బెంబేలెత్తుతున్నాయి. కష్టపడి సంపాదించిన డబ్బులో అధిక భాగం తిండికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 25 కిలోల బియ్యం బస్తా నాణ్యత, రకం, బ్రాండ్‌ను బట్టి రూ.1,900 నుంచి రూ.2,200 వరకు విక్రయిస్తున్నారంటూ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. దీంతో నెలవారీ జీతాలపై ఆధారపడే కుటుంబాలు, రోజువారీ కూలీలు, చిరు ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఇంటి ఖర్చులను ఎలా నెట్టుకురావాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికే కందిపప్పు, వంటనూనె, ఉల్లిపాయలు, ఇతర కూరగాయల ధరలు పెరిగి వంటగది బడ్జెట్ తలకిందులవుతోంది. దీనికి తోడు బియ్యం ధరలు కూడా పెరగడంతో సామాన్యుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత భారంగా మారుతోంది. మార్కెట్‌లో ఒకే రకమైన బియ్యానికి దుకాణాన్ని బట్టి వేర్వేరు ధరలు చెబుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

అసలు మిల్లుల వద్ద బియ్యం ధర ఎంత? హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ఎంతకు విక్రయిస్తున్నారు? రిటైల్ దుకాణాలకు చేరే సరికి ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? అనే ప్రశ్నలు వినియోగదారుల్లో వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులు నిర్ణయించిన ధరల ప్రకారమే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు అంటున్నారు.

ప్రభుత్వం పేదలకు రేషన్ బియ్యం అందిస్తున్నప్పటికీ, కుటుంబ అవసరాలు, నాణ్యత, రుచి తదితర కారణాలతో చాలామంది బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో మార్కెట్ ధరలపై నియంత్రణ, వ్యాపార లావాదేవీల్లో పారదర్శకత ఎంతో అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి బియ్యం మిల్లులు, గోదాములు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని వినియోగదారులు కోరుతున్నారు. బియ్యం నిల్వలు, కొనుగోలు ధరలు, విక్రయ ధరలను పరిశీలించి అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు కావాల్సింది ఉచిత హామీలు కాదు.. అందుబాటు ధరల్లో నిత్యావసర వస్తువులు. బియ్యం ప్రతి ఇంటి అవసరం. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ధరల భారం పడకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే పెరుగుతున్న ధరలతో సామాన్యుడి కుటుంబ బడ్జెట్ మరింత చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుర్రాలపాడులో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత.. చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 2 ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు గుర్రాలపాడులో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ బుర్ర మహేష్ మాట్లాడుతూ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పేదల ఆహార భద్రతకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని పేర్కొంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్నబియ్యం పొందడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం కలుగుతుందని నాయకులు వివరించారు.

అనంతరం గుర్రాలపాడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేయడమే ప్రభుత్వ సంక్షేమ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, చిన్నారులకు యూనిఫామ్‌ల అందజేతపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు బానోత్ ప్రసాద్, బానోత్ దివ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోర్నే సీతారాములు, 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కర్లపూడి భద్రకాళి, 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల రామ్మోహన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది జ్యోతి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి: పన్యాల జైపాల్ రెడ్డి





ఎల్బీనగర్, పెన్ పవర్, నవంబరు 2: తెలంగాణ రాష్ట్రం, ప్రజలపై, ప్రజాకవి గద్దర్ అన్నపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ అడ్వకేట్ మదుపు శశికాంత్, అడ్వకేట్ నల్లగాటి రాంబాబు, న్యాయవాదులు ఆకుల సత్యనారాయణ, జక్కుల వెంకటేష్, ప్రసాద్, సీనియర్ నాయకులు జానిమియా, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అర్రబైరు ప్రవీణ్ రెడ్డి, కరీం, నరేందర్, అస్లాం, భాను తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు- వైఎస్ఆర్సీపీకి ఫలితాలు కీలకం

విజయవాడ, నవంబర్ 2, పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసింది. మున్సిపల్ పరిధిలోని పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ప్రధాన అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రమైంది. క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం , పోలింగ్ సరళిని విశ్లేషిస్తే.. ఎన్నికల సమరం దాదాపు ఏకపక్షంగానే సాగిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికార ఎన్డీయే కూటమి సమన్వయంతో, అత్యంత ఉత్సాహంగా ఓటర్లను పోలింగ్ బూతులకు తరలించగలిగితే, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రం మొదటి నుంచి ఆ స్థాయి వ్యూహాత్మక ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోయాయని భావిస్తున్నారు.వాస్తవానికి ఈ పురపాలక సమరంలో పోటీకి దిగడంపై వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ప్రారంభికంగా కొంత సందేహాలు నిలిచాయి. ఓటమి చవిచూసిన తర్వాత ఏర్పడిన నిరాశ, ఆర్థిక , లీగల్ ఒత్తిళ్ల కారణంగా పోటీకి దిగేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీలో నిలిచారు. పోటీపడినప్పటికీ గెలుపును నిర్దేశించే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ , నిధుల సమీకరణ , ముమ్మర ప్రచారంలో అధికార కూటమిని ఢీకొట్టే స్థాయిలో వైసీపీ సీరియస్‌గా దృష్టి సారించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. స్థానిక నాయకత్వంపై రకరకాల ఒత్తిళ్లు ఉండటం, అనేక ప్రాంతాల్లో నామినేషన్ల ఘట్టం నుంచి ప్రచారం దాకా అనుకున్న స్థాయిలో సహకారం లభించకపోవడం వల్ల ఈ పుర ఎన్నికల్లో వైసీపీకి ప్రతికూల ఫలితాలు వస్తాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, రాయలసీమలోని కొన్ని కంచుకోటలు, కడప, పులివెందుల, ఉమ్మడి ఉమ్మడి జిల్లాలలోని సొంత సీట్లతో పాటు పట్టణాల్లోని పేద వర్గాల ఓటు బ్యాంక్ తమను గట్టెక్కిస్తుందని వైఎస్సార్‌సీపీ ఆశాభావంతో ఉంది. కనీస స్థాయిలో స్థానాలు సాధించినా సరే, పార్టీ ఇమేజ్ నిలబడుతుందని అధిష్ఠానం ధీమాగా ఉంటే.. పరాజయం ఎదురైతే కేడర్ మానసిక స్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.ఈ పురపాలక ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్ల అధికార పీఠాలకే పరిమితం కాకుండా, ఇరు పార్టీల శ్రేణుల మానసిక దృక్పథం పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత కోలుకోవడానికి ప్రయత్నిస్తున్న వైసీపీకి ఈ ఫలితాలు ఒక పరీక్ష లాంటివి. ఒకవేళ ఊహించని విధంగా వైసీపీ ఓ మాదిరి ఫలితాలను సాధించగలిగితే.. "పార్టీకి ఇంకా క్షేత్రస్థాయిలో పట్టు ఉంది, ప్రజాదరణ తగ్గలేదు అనే సందేశం ప్రజల్లోకి వెళ్లి, నాయకుల్లో సరికొత్త ఉత్సాహం నిండుతుంది. క్లిష్ట సమయం నుంచి కోలుకోవడానికి ఆ పార్టీకి ఇవి సంజీవనిలా ఉపయోగపడతాయి.మరోవైపు, అధికారంలోకి వచ్చాక సాధిస్తున్న ఈ విజయాల ఊపును కొనసాగించాలని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరుతోంది. పట్టణ ప్రాంత ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధి, మౌలిక సదుపాయాల వైపే మొగ్గు చూపుతారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు తమకే విజయాన్ని అందిస్తాయని కూటమి నేతలు చెప్తున్నారు. నవంబర్ 3న వెలువడబోయే ఓట్ల లెక్కింపు ఫలితాలు వైఎస్సార్‌సీపీ భవిష్యత్ కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యమైన దిక్సూచిగా మారనున్నాయి. ఈ ఫలితాలు వైసీపీని మళ్లీ పుంజుకునేలా ఉత్సాహపరుస్తాయా లేక అధికార కూటమికి తిరుగులేని ఆధిక్యాన్ని ఇచ్చి ప్రతిపక్షాన్ని మరింత ఇరకాటంలో పడేస్తాయా అనేది మరో రోజులో స్పష్టం కానుంది.

బాల ఉన్మాదులను.. దారిలో పెట్టేది ఎవరు?

అనంతపురం, నవంబర్ 2, పెన్ పవర్:
పాఠశాల అంటే.. చదువులకు చిరునామా.. పిల్లల మాటలు.. ఆటలు.. పాటలు వంటి వాటితో విలసిల్లే పవిత్రమైన ప్రాంతం. అటువంటి పాఠశాలలు దారుణాలకు కేంద్రమవుతున్నాయి. విద్యార్థులు చదువుకోవాల్సిన చోట నెత్తుటి మరకలు కనిపిస్తున్నాయి. అమాయకమైన పిల్లలపై తోటి విద్యార్థులు దారుణమైన దాడులకు దిగుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది. హర్యాన రాష్ట్రంలో పంచకుల ప్రాంతంలో తాజాగా జరిగిన ఘటన మన విద్యా వ్యవస్థలో ఉన్న లోపాన్ని.. పిల్లల ఆలోచన తీరును ఎత్తిచూపుతోంది.హర్యానా రాష్ట్రంలోని పంచకుల ప్రాంతంలో సెక్టార్ 20 లో సంస్కృతి మోడల్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో జరిగిన సంఘటన దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. ఇక్కడ కేజీ చదువుతున్న ఒక చిన్నారిపై.. ఇదే పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఒక బాలుడు ఇటుకరాలతో దారుణంగా దాడి చేశాడు. బాలుడు చేసిన దాడుల వల్ల ఆ పాప స్పృహ కోల్పోయింది. ఆ పాపను ప్రస్తుతం ఒక ఆసుపత్రికి తరలించారు. అతడు చేసిన దాటికి సంబంధించిన దృశ్యాలు సిసి కెమెరాల ద్వారా బయటికి రావడంతో.. వాస్తవం ఏంటనేది తేలింది.ఇక రాప్తాడులో పదవ తరగతి చదివే విద్యార్థిని మీద.. ఒక యువకుడు తరగతి గదిలో అందరూ చూస్తుండగానే రంపం తో దాడి చేశాడు. ఈ దాడిలో ఆ బాలిక చెయ్యి తెగిపోయింది. ముఖం మీద తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ప్రేమకు నిరాకరించడం వ ల్లే అతడు ఈ స్థాయిలో దారికి పాల్పడినట్లు తెలుస్తోంది.ఇక నల్గొండ జిల్లాలో స్కూల్ ప్రిన్సిపాల్ ను అదే పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యంత దారుణంగా చంపేశారు. ఆమె దగ్గర ఉన్న డబ్బులను దొంగిలించారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రంలో సంచలనం కలిగించింది.వాస్తవానికి చిన్న పిల్లలు ఇలా మారిపోవడానికి కారణాలు అనేకం ఉన్నాయి అంటున్నారు సైకాలజిస్టులు. ఈ విపరీత ధోరణికి అడ్డుగడ్డ వేయాలంటే పోలీసు కేసులు మాత్రమే సరిపోవని చెబుతున్నారు. తల్లిదండ్రులు.. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు ఉమ్మడిగా బాధ్యత తీసుకోవాలని చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజు సమయం కేటాయించాలని.. వారితో మాట్లాడాలని.. వారి మాట తీరును పరిశీలించాలని.. పాఠశాలలో వారికి ఎదురైనా అనుభవాలు.. స్నేహితుల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్ ఇచ్చేటప్పుడు.. వారు చూస్తున్న కంటెంట్.. ఆడుతున్న గేమ్ లపై నిరంతరం పర్యవేక్షించాలని చెబుతున్నారు. హింసాత్మకమైన ఆటలకు దూరంగా ఉండే విధంగా చేయాలని. ఇంట్లో ఏమాత్రం గొడవలు లేకుండా ప్రశాంతమైన వాతావరణం అందించాలని.. కోపాన్ని కాకుండా.. ప్రేమతో వారిని దగ్గర తీసుకోవాలని చెబుతున్నారు.. పాఠశాలల్లో కూడా సైకాలజిస్టులను నియమించుకోవాలని.. వారితో ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ అందించాలని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. మార్కులు.. ర్యాంకులు కాకుండా.. మానవీయకోణం.. ఇతరులను గౌరవించడం.. తోటి వారి మీద దయ కలిగి ఉండే వాటి లక్షణాలను పెంపొందించాలని సూచిస్తున్నారు.

హేమంత్ ఎన్ కౌంటర్

అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివే బాలిక మీద హేమంత్ అనే దుర్మార్గుడు తరగతి గదిలో చెట్లు కోసే రంపం తో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. అతడు రంపంతో కోయడంతో ఒక చేయి విరిగింది. ముఖం మీద.. అనేక ప్రాంతాలలో తీవ్రంగా గాయాలయ్యాయి. రక్త స్రావం కూడా అధికంగా జరిగింది.మొదట్లో స్థానికంగా చికిత్స అందించినప్పటికీ.. అత్యవసర వైద్యం అందించాల్సి రావడంతో ఆ బాలికను బెంగళూరు తరలించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు దాదాపు 12 గంటల పాటు శ్రమించి ఆమెకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులతో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు మాట్లాడారు. బాలికకు అందుతున్న వైద్యం గురించి సంప్రదింపులు జరిపారు. ఆదివారం మధ్యాహ్నం బాధిత బాలికను నారా లోకేష్ పరామర్శించారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ దారుణానికి పాల్పడిన హేమంత్ శనివారమే పోలీసులకు చిక్కాడని వార్తలు వచ్చాయి. అయితే ఆదివారం సాయంత్రం దాటిన తర్వాత ఆ దుర్మార్గుడికి సంబంధించిన వార్తలు మీడియాలో విస్తృతంగా సర్కులేట్ అయ్యాయి. హేమంత్ ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉన్నాడని.. పోలీసులు అతడిని పట్టుకునే క్రమంలో ఎదురు తిరిగాడని.. ఈ నేపథ్యంలో పోలీసులు అతని మీద కాల్పులు జరిపారని తెలుస్తోంది. దాదాపు 6 రౌండ్ల పాటు అతని మీద కాల్పులు జరిపారని సమాచారం. పోలీసుల కాల్పుల వల్ల హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించారని ప్రచారం జరుగుతోంది.ఈ ఘటన జరిగిన తర్వాత హేమంత్ ను ఎన్కౌంటర్ చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు వ్యక్తం అయ్యాయి. నిన్న ఘటన జరిగిన దగ్గర నుంచి ఇవాల్టి వరకు కూడా సోషల్ మీడియాలో ఇదే చర్చ నడుస్తోంది. అటువంటి వ్యక్తులకు బతికే అవకాశం లేదని.. సమాజంలో మృగాల కంటే హీనంగా వ్యవహరిస్తున్న హేమంత్ లాంటి వ్యక్తులు బతకకూడదని.. సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఫోకస్ మొత్తం ఆ బాలికను ప్రాణాపాయం నుంచి బయటికి తీసుకొచ్చే దానిమీద మాత్రమే ఉంది. అయితే పోలీసు వ్యవస్థ హేమంత్ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చిందని తెలుస్తోంది.

చిన్నారికి సర్జరీ.. విద్యార్థులకు కౌన్సెలింగ్

మరోవైపు, ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన తోటి విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపేందుకు లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకోసం 20 మంది కౌన్సెలర్లతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం, ఘటన జరిగిన పదో తరగతి 'ఏ' సెక్షన్‌లోని 32 మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారితో, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతోంది. అదేవిధంగా 8, 9, 10 తరగతులకు చెందిన ఇతర విద్యార్థినులకు కూడా కౌన్సెలింగ్ అందించనున్నారు.ఈ చర్యల ద్వారా విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, తిరిగి ఆత్మవిశ్వాసంతో పాఠశాలకు హాజరయ్యేలా చూడటమే లక్ష్యమని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా చదువుపై దృష్టి సారించేలా అవసరమైన సహాయాన్ని కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.

మరో వాయిగండం...

విశాఖపట్టణం, నవంబర్ 2, పెన్ పవర్:
బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను వేగంగా ముందుకు కదులుతుండటంతో ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అర్నబ్ తుపాను ప్రభావంతో జరిగిన నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉండటం ప్రజలను కలవరపెడుతోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు వాతావరణశాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది.బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను గత ఆరు గంటల్లో గంటకు 23 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 560 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 640 కిలోమీటర్లు, నెల్లూరుకు 630 కిలోమీటర్లు, ఒంగోలుకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను కదలికలను వాతావరణశాఖ నిశితంగా పరిశీలిస్తోంది. రేపు ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇది తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.మురసు తుపాను తీరం దాటే సమయంపై వాతావరణశాఖ అంచనాలు ఆసక్తికరంగా మారాయి. సోమవారం అర్ధరాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజామున నెల్లూరు నుంచి నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు నమోదయ్యే ప్రమాదం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా సముద్ర తీరానికి సమీపంలో నివసించే మత్స్యకార కుటుంబాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా



పాటించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.తుపాను ప్రభావం కేవలం తీర ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలపై ఉండనుంది. మరో మూడు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో వరద నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని చెబుతున్నారు.మురసు తుపాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ

ప్రఖర్ జైన్ సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, అధికారుల నుంచి వచ్చే హెచ్చరికలను పాటించాలని కోరారు. అవసరమైన మందులు, తాగునీరు, అత్యవసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.మురసు తుపాను గమనం, తీవ్రత, తీరం దాటే ప్రాంతంపై స్పష్టత వచ్చే కొద్దీ ఏపీ యంత్రాంగం అప్రమత్తతను మరింత పెంచాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. తుపాను ప్రభావం ఎంత మేర ఉంటుందనేది రాబోయే 24 గంటల్లో కీలకం కానుంది. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండటం, అధికారుల సూచనలను పాటించడం అత్యంత అవసరం.

1300 కే ఏపీలో ధరణి రైస్

రాజమండ్రి, నవంబర్ 2, పెన్ పవర్: దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో బహిరంగ మార్కెట్లో బియ్యంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా పలు రకాలకు చెందిన బియ్యం కిలో రూ. 80 నుంచి రూ.100కు చేరింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఏపీ ప్రభుత్వం వారికి శుభవార్త చెప్పింది.భారీగా పెరుగుతున్న బియ్యం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించేలా రాయితీపై పలు రకాల వస్తువులను అందిస్తోంది. ఫైన్ రకం బియ్యంతోపాటు.. ఉల్లిపాయతోపాటు ఇతర కూరగాయలను రాయితీపై అందిస్తోంది. అయితే, ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఊరటనిచ్చే విధంగా రూ. 1300లకే ధరణి బ్రాండ్ 26కిలోల సన్నబియ్యం బస్తాను అందుబాటులోకి తీసుకొచ్చింది.రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలులో తిరుపతి జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లాలోని రెండు ప్రధాన రైస్ మిల్లుల నుంచి తిరుపతి జిల్లాతోపాటు చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల మొత్తం ఎనిమిది జిల్లాలకు ధరణి బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్నారు. ప్రతీరోజూ వేలాది క్వింటాళ్ల బియ్యం రైతుబజార్లు, పంపిణీ కేంద్రాలకు రవాణా అవుతోంది. తక్కువ ధరకు అందిస్తున్న 26కిలోల ధరణి బ్రాండ్ సన్న బియ్యం బస్తాలను అర్హులైన ప్రతీఒక్కరికీ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. బస్తాను పొందే వినియోగదారుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్లను నమోదు చేస్తున్నారు.పాస్తా ఎంచుకోండిఇదిలాఉంటే.. ఈ ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతు బజార్లలో మాత్రమే కాకుండా మొబైల్ వాహనాల ద్వారా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు కూడా విక్రయాలను విస్తరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలని అన్నారు. మిగిలిన బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. మరోవైపు బియ్యం ధరలు అదుపులో ఉండేలా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో అధికారులు చర్చిస్తున్నారు. కొన్నిరకాల బియ్యం ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యం కేజీ రూ.66, సాధారణ స్టీమ్ బియ్యం కేజీ రూ.47కు మించకుండా విక్రయించేందుకు అంగీకరించారని అధికారులు చెబుతున్నారు.

జైన్ జీకి అనుకూలంగా విజయసాయి అడుగులు


నెల్లూరు, నవంబర్ 2, (పెన్ పవర్: విజయసాయిరెడ్డి పార్టీ ఉద్దేశాలు.. విధివిధానాలను ఆయన అప్పుడప్పుడు సినిమా టీజర్ లాగా విడుదల చేస్తున్నారు.విజయ సాయి రెడ్డి ప్రజలను కాకుండా.. సామాజిక మాధ్యమాలను నమ్ముకున్నారు. తన పార్టీ గురించి.. విధివిధానాల గురించి ఇప్పటివరకు కొన్ని విషయాలు మాత్రమే చెప్పారు. ఇప్పుడు వాటిని బహిరంగంగా బయటపెట్టే క్రమంలో రీల్స్ ను ఉపయోగిస్తున్నారు. జన్ జడ్ మీద పూర్తిగా దృష్టి సారించిన ఆయన.. వారిని ఆకట్టుకునేందుకు రీల్స్ మాత్రమే మార్గమని భావించారు. అందువల్లే రియల్ టైం నుంచి రీల్స్ టైం లోకి వచ్చేసారు.ఒకప్పుడు విజయసాయిరెడ్డి వైసీపీలో కీలక నాయకుడిగా ఉండేవారు. జగన్ కు దగ్గరగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత సొంత రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని పనులు నిమగ్నమయ్యారు. అయితే ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చిన తీరు.. ప్రజల్లోకి వెళ్లాలి అనుకుంటున్నా ప్రచార పద్ధతులు ఇప్పుడు పూర్తిగా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రీల్స్ ద్వారా తన రాజకీయ ఆలోచనలను ఆయన ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.విజయసాయిరెడ్డి గతంలో రాజ్యసభ సభ్యుడిగా.. వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2025 జనవరిలో రాజ్యసభ సభ్యత్వానికి.. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. క్రియాశీలమైన రాజకీయాలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. అయితే ఆ విరామం ఎక్కువ కాలం కొనసాగలేదు. సరిగా ఈ ఏడాది ఆగస్టులో తిరిగి రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రజల గొంతుకను.. అసెంబ్లీ.. పార్లమెంట్లో వినిపించేందుకు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఆయన వెల్లడించారు.ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీలు రావడం కొత్తేమీ కాదు. కానీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయాల్లోకి తిరిగి వస్తున్న తీరు మాత్రం ఆసక్తిని కలిగిస్తోంది. ఒకప్పుడు వైసిపి కీలక వ్యూహకర్తగా వ్యవహరించిన ఆయన ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు అడుగులు వేస్తున్నారు. అయితే ఈసారి ఆయన రాజకీయ ప్రచారంలో సోషల్ మీడియాకు.. ముఖ్యంగా డిజిటల్ మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాలు మారిపోతున్నాయా.. రాజకీయ ప్రచారం రీల్స్ స్థాయికి చేరుతోందా అరే చర్చ కూడా మొదలైంది. విజయ్ సాయి రెడ్డి గతంలో జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ వ్యవహారాలలో కీలక పాత్ర పోషించారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. అయితే 2025 జనవరిలో ఊహించని విధంగా రాజ్యసభ సభ్యత్వానికి.. వైసీపీకి రాజీనామా చేశారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటారని సంకేతాలు కూడా ఇచ్చారు. కానీ 2020లో మళ్ళీ తన రాజకీయ భవిష్యత్తుపై కీలకమైన ప్రకటనలు చేస్తూ.. సంచలనానికి కారణమయ్యారు.తన రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యయాన్ని ప్రారంభించాలని విజయ సాయి రెడ్డి అనుకున్నారు. టిడిపి.. వైసిపి వంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రజల సమస్యలను అసెంబ్లీ.. పార్లమెంట్ లో వినిపించడమే తన లక్ష్యమని చెప్పారు. తన పార్టీలో యువతకు పెద్దపీట వేస్తానని కూడా వెల్లడించారు. 40 సంవత్సరాల వారికి పార్టీలో అవకాశాల్లో 66% ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి జనవరి 1న ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించడం.. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగులకు నెలకు పదివేల భృతి ఇచ్చే ప్రతిపాదనను ప్రస్తావించారు..కొత్త పార్టీ ఏర్పాటుకు విజయసాయిరెడ్డి ముహూర్తాన్ని కూడా ప్రకటించారు.
నవంబర్ 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో పార్టీ పేరు ప్రకటిస్తానని అక్టోబర్ 20న ఆయన వెల్లడించారు. దీంతో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ రాక మీద చర్చ మొదలైంది. ఇప్పటి రాజకీయాల్లో సభలు, సమావేశాలు, ప్రెస్ మీట్లు మాత్రమే సరిపోవడం లేదు.. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వెళ్లడం కూడా ముఖ్యమైనదని.. ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్..ఇన్ స్టా గ్రామ్ రీల్స్, ఫేస్ బుక్ వీడియో ద్వారా తన ప్రసంగాలను ప్రజలకు తీసుకెళ్లాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారు.

తీవ్ర తుపానుగా మురసు.. ఏపీ తీరానికి రెడ్ అలర్ట్

నెల్లూరు పెన్ పవర్:
పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'మురసు' తుపాను, తీవ్ర తుపానుగా బలపడింది. ఇది నేటి అర్ధరాత్రి నుంచి రేపు (3వ తేదీ) తెల్లవారుజాము లోపు నెల్లూరు – నర్సాపురం మధ్య, ప్రధానంగా ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సోమవారం ఉదయం నాటికి ఈ తుపాను ఒంగోలుకు 330 కి.మీ, నెల్లూరుకు 290 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, ఇవి గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల తీర ప్రాంతాల్లో 1.0 నుంచి 1.5 మీటర్ల ఎత్తున సముద్రపు అలలు (స్టార్మ్ సర్జ్) ఎగిసిపడే ప్రమాదం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని అధికారులు స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

: మురసు తుపాను ముంచేస్తుందా?. తెలుగు ప్రజలకు హై అలెర్ట్



మురసు తుపాను దూసుకు వస్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తుఫానుగా బలపడే సూచనలు ఉండటంతో నేడు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గడిచిన కొద్ది గంటల్లో గంటకు 27 కిలో మీటర్ల వేగంతో తుపాను కదులుతుంది. ఒంగోలుకు 600 కిమీ, విశాఖపట్నానికి 610 కిమీ దూరంలో కేంద్రీకృతమయింది. రేపు ఉదయానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. రేపు అర్ధరాత్రి --ఎల్లుండి తెల్లవారుజాము సమయంలో నెల్లూరు -నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకి వెళ్ళకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఏపీలో భారీ వర్షాలు...

ఆంధ్రప్రదేశ్ లో నేడు పలు చోట్ల భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న మూడురోజులు దక్షిణకోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నేడు కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఒకటి,రెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. ఏలూరు, తూర్పు గోదావరి, , పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు, అల్లూరి, పోలవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే సహాయక చర్యలు కోసం ముందస్తుగా ఎన్.డి.ఆర్.ఎఫ్, ఏడు ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. తుఫాను ప్రభావంతో కోస్తాంధ్ర మరియు రాయలసీమ వ్యాప్తంగా నేడు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు.

తెలంగాణలో అక్కడక్కడ వానలు...

తెలంగాణలో నేడు అక్కడక్కడా వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల మోస్తరు వానలు, మరికొన్ని చోట్ల తేలికపాటి వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను ప్రభావంతో వానలు పడతాయని తెలిపింది. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అల్పపీడన ప్రభావం కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ, తూర్పు జిల్లాలతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదాదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది.రేపు అర్ధరాత్రి --ఎల్లుండి తెల్లవారుజాము సమయంలో నెల్లూరు -నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నీతా అంబానీ గొప్ప మనసు.. 5 వేల మంది నిరాశ్రయులకు అండగా 'అనంత్ ఆశ్రయ్'



ఒక చిన్నారికి భవిష్యత్తుపై ఆశ కల్పించడం.. ఒక వృద్ధుడికి చివరి జీవితంలో ఆప్యాయతను అందించడం.. ఒక దివ్యాంగుడికి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవకాశం కల్పించడం.. ఇవన్నీ వెలకట్టలేని సేవలు. 5 వేల మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలనే నీతా అంబానీ ప్రయత్నం విజయవంతమైతే.. ఎంతోమందికి ఇది కొత్త జీవితానికి నాంది కావచ్చు.సంపద ఉంటే సుఖంగా జీవించవచ్చు.. కానీ ఆ సంపదతో మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపగలిగితేనే నిజమైన గొప్పతనం. కోట్లాది రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని కలిగి ఉన్న అంబానీ కుటుంబం మరోసారి తన సేవా దృక్పథంతో వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ తీసుకున్న ఒక గొప్ప నిర్ణయం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన చిన్నారులు.. వయసు పైబడిన తర్వాత ఆదరించే వారు లేక ఒంటరిగా మిగిలిపోయిన వృద్ధులు.. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు అండగా నిలిచేందుకు ఆమె ఒక బృహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు.నీతా అంబానీ తన పుట్టినరోజు సందర్భంగా 'నీతా అంబానీ అనంత్ ఆశ్రయ్' పేరుతో ఈ ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని ప్రకటించారు. సమాజంలో నిరాదరణకు గురవుతున్న సుమారు 5 వేల మందికి ఆశ్రయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం ఒక ప్రత్యేక టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం కూడా నిర్వహించారు.సాధారణంగా అనాథ పిల్లల కోసం ప్రత్యేక ఆశ్రమాలు, వృద్ధుల కోసం వృద్ధాశ్రమాలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాలు ఉంటాయి. అయితే ఈ మూడు వర్గాలకు చెందిన వారిని ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి వారికి అవసరమైన వసతులు, భద్రత, సంరక్షణ అందించాలనే ఆలోచన ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా నిలుపుతోంది.ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఒక కుటుంబం ఉండాలని.. కష్టాల్లో ఉన్నప్పుడు పలకరించే మనిషి ఉండాలని కోరుకుంటారు. కానీ కొందరి జీవితాల్లో ఆ అదృష్టం ఉండదు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు.. చివరి దశలో కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమైన వృద్ధులు.. శారీరక పరిమితులతో ఇతరుల సహాయం అవసరమైన దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటుంటారు.అలాంటి వారికి కేవలం నాలుగు గోడల మధ్య నివాసం కల్పించడం మాత్రమే కాకుండా.. గౌరవంగా జీవించే అవకాశాన్ని అందించాలన్నది ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఒక చిన్నారికి విద్య.. ప్రేమతో కూడిన వాతావరణం ఎంత అవసరమో.. ఒక వృద్ధుడికి ఆప్యాయంగా పలకరించే మనిషి కూడా అంతే అవసరం. దివ్యాంగులకు కూడా ఆత్మగౌరవంతో జీవించేలా తగిన సౌకర్యాలు కల్పించడం ఎంతో ముఖ్యం.ఈ బృహత్తర ప్రాజెక్టును రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. నీతా అంబానీతో పాటు ఆమె చిన్న కుమారుడు అనంత్ అంబానీ కూడా ఈ కార్యక్రమంతో అనుబంధమై ఉన్నారు. 5 వేల మందికి వసతి కల్పించాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు నిర్వహణ, సంరక్షణ, సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు ఉండనున్నాయి.వ్యాపారంలో విజయాలు సాధించడం ఒక ఎత్తయితే.. సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం మరో ఎత్తు. ముఖ్యంగా ఎవరూ లేని వారికి తామున్నామనే భరోసా కల్పించడం ఎంతో గొప్ప విషయం. నీతా అంబానీ ప్రకటించిన 'అనంత్ ఆశ్రయ్' ప్రాజెక్టు కూడా అలాంటి మానవీయ ఆలోచనకు ప్రతిరూపంగా నిలుస్తోంది.డబ్బు సంపాదించడం మాత్రమే కాదు.. ఆ డబ్బుతో ఇతరుల కన్నీళ్లు తుడవడం కూడా ముఖ్యమని చాటిచెప్పే ఈ కార్యక్రమం నిజంగా అభినందనీయం. ఎందుకంటే కొందరికి ఇల్లు అంటే కేవలం నివాసం.. మరికొందరికి అదే ప్రేమ, భద్రత, ఆత్మీయత కలిగిన ప్రపంచం. అలాంటి ప్రపంచాన్ని 5 వేల మందికి అందించాలనే ఆలోచనే 'అనంత్ ఆశ్రయ్'కు అసలైన ప్రత్యేకత..

ఏంటీ.. మ్యాగీ అమ్ముకుంటూ రోజుకు 15 వేలు సంపాదిస్తున్నాడా..

ఉద్యోగాలు వేస్ట్ బండి పెట్టుకుంటే బెటర్..!



పొద్దున ఏడు గంటలకు లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు ఉద్యోగం, ట్రాఫిక్.. ఇంటికెళ్లిన తర్వాత కూడా ఆఫీసులో ఏం జరుగుతుందనే టెన్షన్.. ఆఫీసులో రేపటి టార్గెట్ పై రాత్రంతా పరేషాన్.. 30 రోజులు కష్టపడితే వచ్చే జీతం.. అలా పడితే ఇలా అయిపోతుంది.. మళ్లీ నెలంతా అప్పులు, చేబదుల్లే.. ఇంతా కష్టపడినా సుఖం లేదు.. సుఖమైన నిద్ర లేదూ.. సిటీలో సగటు ఉద్యోగస్తుడి బాధులు ఇవి.. ఇలాంటప్పుడే కొన్ని వార్తలు అద్భుతంగా అనిపిస్తుంటాయి.. అలాంటి వాటిలో ఇది ఒకటి.. మ్యాగీ అమ్ముకుంటూ రోజుకు 15 వేల రూపాయలు సంపాదిస్తున్నాడంట.. ఈ వార్త చదివిన తర్వాతనే.. పైన చెప్పిన ఉద్యోగస్తుడి ఆవేదన, దుఖం తన్నుకు వస్తుంది. ఇంతకీ రోజుకు 15 వేల రూపాయలు సంపాదిస్తున్న ఆ మ్యాగీ సెల్లర్ పూర్తి వివరాలు తెలుసుకుందామా....

హిమాచల్ ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ పాస్‌లో రోడ్డు పక్కన మ్యాగీ స్టాల్ నడుపుతున్న ఒక వ్యక్తి గురించి సోషల్ మీడియాలో ట్రెండవుతోంది. టూరిజం సీజన్ కాకపోయినా (ఆఫ్-సీజన్) కూడా అతను రోజుకు సుమారు 14 వేల నుంచి 15 వేల రూపాయల వరకు టర్నోవర్ సాధిస్తుండటం వైరల్ అవుతోంది. కంటెంట్ క్రియేటర్ హర్ష్ చౌహన్ రోహ్‌తాంగ్ పాస్‌కు వెళ్లినప్పుడు ఈ మ్యాగీ వ్యాపారితో మాట్లాడి వీడియో తీశారు. ఆఫ్-సీజన్‌లో ఎంత సంపాదిస్తున్నారు? అని అడగగా, ఆ వ్యాపారి ఇలా చెప్పాడు. రోజుకు 60 నుంచి 70 ప్లేట్ల మ్యాగీ అమ్ముతానని చెప్పాడు. ఒక్కో ప్లేట్ 100 రూపాయలు. అలాగే సుమారు 200 కప్పుల టీ అమ్ముతాడట. ఒక్క చాయ్ 40 రూపాయలు. ఈ లెక్క ప్రకారం రోజువారీ సేల్స్ 14 వేల నుంచి 15 వేల వరకు ఉంటోంది. ఉదకబెట్టిన గుడ్డు ఆర్డర్లు కూడా కొన్ని వస్తున్నాయని చెప్పారు.హర్ష్ చౌహన్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఇది కేవలం ఆఫ్-సీజన్ మాత్రమే... పీక్ సీజన్‌లో ఎంత టర్నోవర్ ఉంటుందో ఊహించండి! అంటూ పోస్ట్ చేశారు. చిన్న వ్యాపారం అనేది ఏమీ లేదు చెబుతూ షేర్ చేసిన వీడియోపై ఎందరో కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్ట్రెస్ జాబ్స్ వదిలి మ్యాగీ అమ్ముకున్నా హాయిగా బతికేయొచ్చు కదా అంటూ రిప్లై ఇస్తున్నారు. అయితే కొందరు ఇది కేవలం గ్రాస్ సేల్స్ మాత్రమేనని, నిజమైన లాభం లెక్కించాలంటే ఖర్చులు తీసివేయాలని అంటున్నారు. ఎత్తైన ప్రాంతానికి సరుకులు తీసుకురావడం, కఠినమైన వాతావరణం, శారీరక శ్రమ వంటి కారణాలతో ఖర్చులు ఎక్కువగా ఉంటాయని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, చిన్న వ్యాపారుల సామర్థ్యం ఏంటో చెబుతోందని కామెంట్స్ చేస్తున్నారు.

మురసు ముంచేస్తుందా? ఈ జిల్లాల్లో ఎఫెక్ట్ బలంగా పడనుందా?



: ఆంధ్రప్రదేశ్ లో మురసు తుపాను ప్రభావం కనిపిస్తుంది. ఇప్పటికే అనేక జిల్లాల్లో వానలు మొదలయ్యాయి. భారీ వర్షాలతో కొన్ని ప్రాంతాలు జలమయ్యే అవకాశాలున్నాయి. మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతుండటంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వాగులు వంకలు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

దూసుకొస్తున్న మురసు...

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మురసు దూసుకొస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.గడచిన 6 గంటల్లో గంటకు 22 కిమీ వేగంతో కదులుతున్న మురసు తుపాను ఈ రోజు అర్ధరాత్రి తర్వాత నెల్లూరు - నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. మురసు తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు...

మరొకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం జిల్లా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. తీరం దాటే సమయంలో వంద నుంచి 120 కిలమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల కలెక్టర్లు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కలెక్టర్లు కృషి చేయాలన్న చంద్రబాబు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. మరొకవైపు మురసు తుపాన్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. మురసు తుపాను పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తీ తుపాను ప్ర ప్రభావం చూపనుందని, అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు.

విజయవాడ లో గెలుపుపై ఉత్కంఠ... త్రిముఖ పోటీలో నెగ్గేదెవరు?



విజయవాడ కార్పొరేషన్ లో త్రిముఖ పోటీ నెలకొంది. నినన జరిగిన పోలింగ్ తక్కువ శాతం నమోదు కావడంతో గెలుపు ఎవరిది? అన్నది చర్చనీయాంశమయింది. ప్రస్తుతానికి ఓట్ల లెక్కింపు పూర్తి కావాల్సి ఉండటంతో గెలుపెవరిదనేది ఉత్కంఠ నెలకొంది. ముగ్గురు బలమైన అభ్యర్థులు బరిలో ఉండటంతో ఓటర్ల తీర్పు ఎవరి వైపు మొగ్గు చూపుతారన్న టెన్షన్ రాజకీయ పార్టీల్లో నెలకొంది. విజయవాడ ఓటర్లు తక్కువగా పోలింగ్ కేంద్రాలకు రావడం కూడా గెలుపోటములను ప్రభావం చేసే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. విజయవాడ ప్రధానంగా కులం ఆధారంగా ఎన్నికలు జరుగుతుండటంతో గెలుపు ఎవరిది? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతుంది.

వంగవీటి వారసుడిగా...

కూటమి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో ఉన్నారు. జనసేన పార్టీ తరపున కూటమి అధికారిక అభ్యర్థిగా గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేశారు. విజయవాడ రాజకీయాల్లో బలమైన ముద్ర ఉన్న వంగవీటి మోహన రంగా వారసత్వం ఈయనకు అండగా ఉంది. విజయవాడలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఎమ్మెల్యేలే ఉండటం, ఎంపీ కేశినేని చిన్ని, బొండా ఉమా, గద్దె రామ్మోహన్ వంటి సీనియర్ నేతలు ప్రచారాన్ని భుజాన వేసుకోవడం ప్లస్ పాయింట్. కూటమి ఓట్లు సంపూర్ణంగా బదిలీ అయితే ఈయనకు గెలుపు అవకాశాలు మెండుగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థిగా...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాయన భాగ్యలక్ష్మి పోటీలో ఉన్నారు. విజయవాడ ప్రస్తుత మేయర్ అయిన రాయ విజయవాడ ప్రస్తుత మేయర్ అయిన ఈమె, వైసీపీ తరపున మళ్లీ బరిలోకి దిగారు. నగరంలో పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంక్, మహిళా ఓటర్లలో ఉన్న పట్టుపై వైసీపీ నమ్మకం పెట్టుకుంది. గత ఐదేళ్ల పాలనలో తాము చేసిన పనులను చూపిస్తూ, కూటమి వ్యతిరేక ఓట్లను చీల్చకుండా తమ వైపు తిప్పుకోవాలని వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహించారు.

స్వతంత్ర అభ్యర్థిగా...

ఇండియా కూటమి మద్దతుదారుగా ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. రిటైర్డ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అయిన ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్రంగా బరిలోకి దిగగా, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలు ఈయనకు మద్దతు ప్రకటించాయి.ఈయన ఎంట్రీతో విజయవాడ కార్పొరేషన్ పోరు ఆసక్తికరమైన త్రిముఖ చదరంగంగా మారింది. నగరంలో ఆస్తి పన్ను పెంపు, ఖాళీ స్థలాల పన్ను రద్దు వంటి స్థానిక పౌర సమస్యలపై స్పష్టమైన అజెండాతో ప్రచారం చేసి, విద్యావంతులు, తటస్థ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

గెలుపు అవకాశాలు ఎవరివి?

రాజకీయ విశ్లేషణల ప్రకారం, నగరంలోని 86 డివిజన్లలో ఎక్కువ చోట్ల అధికార కూటమికి స్పష్టమైన సానుకూలత కనిపిస్తోందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. అయితే ఏబీ వెంకటేశ్వరరావు చీల్చే ఓట్లు, అలాగే వైసీపీ సాంప్రదాయ ఓటు బ్యాంక్ ఏ మేరకు నిలబడుతుందనే అంశాలపైనే మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఆధారపడి ఉంటుంది. రేపు ఫలితాలు వెలువడేంత వరకూ గెలుపుపై అంచనాలు మాత్రం ఊహాగానాలుగా చెప్పాలి.

అస్తిత్వ సంక్షోభం!

ఒక వ్యక్తి తన జీవితాన్ని, ఉనికిని, ప్రయాణాన్ని ప్రశ్నించుకునే పరిస్థితే తాత్విక పరిభాషలో 'అస్తిత్వ సంక్షోభం'. తాను ఎందుకు జీవిస్తున్నాడు? జీవితానికి ఒక లక్ష్యముందా? నిర్ణయాలు సరైనవేనా? కోరుకున్న జీవితాన్ని పొందగలుగుతున్నాడా? అనే ప్రశ్నలు ఒక దశలో ప్రతి మనిషినీ వెంటాడుతుంటాయి. అయితే ఈ సంక్షోభం వ్యక్తులకే పరిమితం కాదు. దేశం కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కోవచ్చు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నామని చెప్పుకుంటున్నా ప్రజాకాంక్షలు నెరవేరనప్పుడు, ప్రజాస్వామ్య విలువలు ప్రశ్నార్థకమైనప్పుడు, పాలకులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లినప్పుడు దేశం కూడా అస్తిత్వ సంక్షోభంలో పడుతుంది. భారత పరిస్థితులను ఈ కోణంలో పరిశీలించాల్సిన తరుణమిది. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ గుర్తింపు పొందుతోంది. అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాల కల్పనవంటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోంది. అదే సమయంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్న వాస్తవాన్ని విస్మరించలేం. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2025 ప్రకారం భారత్‌లో 284 మంది బిలియనీర్లు ఉండగా, ప్రపంచంలో మూడోస్థానంలో నిలిచింది. మరోవైపు ప్రపంచ బ్యాంకు 2025 అంచనాల ప్రకారం రోజుకు 3 డాలర్ల అంతర్జాతీయ దారిద్ర్య రేఖ కింద ఉన్న భారతీయుల శాతం 2022-23లో 5.3 శాతానికి తగ్గింది. సంక్షేమ పథకాలు, ఆహార భద్రత, గృహ నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం కార్యక్రమాలు ఈ పురోగతికి దోహదపడ్డాయి. అయినప్పటికీ పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు ఇంకా సవాళ్లే. సంపద పెరుగుతున్నంత మాత్రాన ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని భావించలేం. అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయా? నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి.

దేశంలో అవినీతి, నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవస్థల్లో జవాబుదారీతనం లోపించడం, పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. అవినీతి అనేది ఏ ఒక్క ప్రభుత్వానికో, రాజకీయ పార్టీకో పరిమితమైన సమస్య కాదు. దశాబ్దాలుగా వ్యవస్థలో వేళ్లూనుకున్న అసంతృప్తికి ఉదాహరణలు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, సామాజిక సంప్రదాయాలు వ్యక్తులకు భద్రత కల్పించేవి. ఇప్పుడు అవి మారుతున్నా, వాటి స్థానంలో కొత్త సామాజిక భద్రతా వ్యవస్థలు పూర్తిస్థాయిలో ఏర్పడలేదు. ఫలితంగా స్వేచ్ఛతోపాటు ఒంటరితనం, అభద్రత, ఆర్థిక ఒత్తిడి కూడా పెరుగుతున్నాయి. వ్యక్తిగత అసంతృప్తి, సామాజిక అస్థిరత, రాజకీయ నిరాశ ఒకదానితో మరొకటి ముడిపడుతున్నాయి. ప్రజలు ప్రభుత్వాలను ప్రశ్నించడం, తమ హక్కుల కోసం ఉద్యమించడం ప్రజాస్వామ్యానికి ముప్పు కాదు. వాటి అణచివేతే విరుద్ధం. విమర్శలను దేశ వ్యతిరేకతగా చిత్రీకరించడం పాలకులకు తగదు.

ఎక్కడినుంచి బయలుదేరాం? ఎక్కడికి చేరాం? ఎటు ప్రయాణిస్తున్నాం? అంటూ వ్యక్తుల మాదిరిగానే.. దేశాలు సైతం తమ ప్రయాణాన్ని సమీక్షించుకోవడం ముఖ్యం. మానసిక వైద్య నిపుణుడు రాబర్ట్ బట్లర్ అభివృద్ధి చేసిన 'లైఫ్ రివ్యూ థెరపీ'లో ఈ ఆత్మపరిశీలనకు ప్రాధాన్యత ఉంటుంది. గత అనుభవాలను కేవలం గుర్తు చేసుకోవడం కాకుండా, వాటి నుంచి అర్థాన్ని గ్రహించి, పరిష్కారం కాని సమస్యలను ఎదుర్కొని, భవిష్యత్తుకు స్పష్టమైన దిశను నిర్ణయించుకోవడం దీని ఉద్దేశం. ఇదే ఈ జాడ్యాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత పాలకులతోపాటు సమాజంపైనా ఉంది. అయితే అవినీతిని వ్యవస్థలో భాగంగా అంగీకరించి, సాధారణ విషయంగా తీసుకోవడం ప్రమాదకరం. ప్రజల హక్కులను కాపాడాల్సిన సంస్థలే ప్రశ్నార్థకమైతే ప్రజాస్వామ్యంపై విశ్వాసం దెబ్బతింటుంది. ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శకతను డిమాండ్ చేస్తూ ముందుకొస్తున్న ఉద్యమాలు ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. సీజేపీ ఉద్యమం ఇందుకు ప్రతిరూపం. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమకు భాగస్వామ్యం ఉండాలని, పాలకులు తమ చర్యలకు సమాధానం చెప్పాలని పౌరులు కోరుకుంటున్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ సంఖ్యలో పేర్లు తొలగించడంపై వ్యక్తమైన ఆందోళనలు, ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు ఈ సూత్రాన్ని దేశ పాలనకు కూడా అన్వయించుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సాధించిన విజయాలను గుర్తించడంతోపాటు, పరిష్కారం కాని సమస్యలను కూడా నిజాయితీగా అంగీకరించాలి. అభివృద్ధి అంటే కేవలం జీడీపీ పెరుగుదల కాదు. పౌరుడికి గౌరవప్రదమైన జీవితం, నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, ఉపాధి, సమాన అవకాశాలు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించగలగడం కూడా అభివృద్ధిలో భాగమే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే స్వేచ్ఛ, పాలనలో పారదర్శకత కోరే అధికారం కూడా దాని పునాదులే. ఫ్రీడమ్ హౌస్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత పౌర స్వేచ్ఛలు, ప్రజాస్వామ్య పరిస్థితులపై వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా ఆత్మపరిశీలనకు అవకాశంగా చూడాలి. అదే సమయంలో పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలనూ గుర్తించాలి. కుటుంబాలు, విద్యాసంస్థలు, మీడియా, రాజకీయ వ్యవస్థలు ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలి. తప్పులను అంగీకరించే సంస్కృతి, భిన్నాభిప్రాయాలను గౌరవించే లక్షణం, అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం సమాజంలో పెరగాలి. ప్రస్తుతం దేశంలో వ్యక్తమవుతున్న నిరసనలు కేవలం కొన్ని సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలు మాత్రమే కావు. ప్రజలు తమ ఉనికిని, హక్కులను, భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాలనే ప్రయత్నంగా కూడా వాటిని చూడాలి. ప్రభుత్వం తన పాలనను సమీక్షించుకోవాలి. రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను గుర్తించాలి. పౌరులు కూడా సమాజ మార్పులో భాగస్వాములు కావాలి. భారత్ ఎదుర్కొంటున్నది కేవలం ఆర్థిక లేదా రాజకీయ సంక్షోభం కాదు. అభివృద్ధి దిశ, ప్రజాస్వామ్య విలువలు, వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక న్యాయం విషయంలో మనం ఎటు పయనిస్తున్నామనే మౌలిక ప్రశ్న. ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన సమయం ఆసన్నమైంది. ఆత్మస్తుతి కాదు.. ఆత్మపరిశీలనే దేశానికి ఇప్పుడు అవసరం. అస్తిత్వ సంక్షోభాన్ని అధిగమించడానికి మార్పు దిశగా అడుగులు వేయాల్సిన తరుణం ఇదే!

పనికొచ్చే పలుకు



సంతోషం తగ్గకూడదు.. సంపాదన పెరగాలి!

జీవితంలో ప్రతి ఒక్కరికీ మంచి ఇల్లుండాలి. ఖరీదైన కారు నడపాలి. లేటెస్ట్ గ్యాడ్జెట్స్ వాడాలి. విలాసవంతమైన జీవితం గడపాలి -అనే కోరికలు సహజం. సాధించడానికి కష్టపడటంలోనూ తప్పులేదు. కానీ ఇక్కడే ఒక చిన్న ప్రశ్న. మనం డబ్బు సంపాదిస్తున్నది జీవితాన్ని సంతోషంగా గడపడం కోసమా? లేక సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన వస్తువుల కోసం జీవితమంతా కష్టపడటానికా? చాలామంది ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించలేకపోతున్నారు. ఒకప్పుడు సౌకర్యం కోసం ఇల్లు కొనుగోలు చేస్తారు. తర్వాత పెద్ద ఇల్లు కావాలనుకుంటారు. దాన్ని అలంకరించడానికి ఖరీదైన ఫర్నిచర్, ఆధునిక హంగులు, విలాసవంతమైన వస్తువులు సమకూర్చుకుంటారు. కారు కొంటే సరిపోదు.. మరింత ఖరీదైన మోడల్ కావాలి. ఫోన్ కొంటే ఏడాది తిరక్కుండానే కొత్త మోడల్‌పై మనసు పడుతుంది. ఇలా అవసరాలు క్రమంగా కోరికలుగా, కోరికలు వ్యామోహాలుగా మారిపోతాయి. చివరకు మనిషి సంపాదనలో ఎక్కువ భాగం ఈ వస్తువుల నిర్వహణకే ఖర్చవుతుంది. ఇంటి ఈఎంఐలు, కారు లోన్లు, ఇన్సూరెన్స్, మెయింటెనెన్స్, విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులు కలిసి ఆర్థిక భారంగా మారతాయి. వాటిని కొనుగోలు చేసినప్పుడు కలిగిన ఆనందం కొద్దిరోజులకే పరిమితమవుతుంది. కానీ వాటి కోసం చేయాల్సిన చెల్లింపులు మాత్రం ఏళ్ల తరబడి కొనసాగుతాయి. అంటే మనం సౌకర్యాలను కొనుగోలు చేస్తున్నామనుకుంటాం. వాస్తవానికి వాటిని నిర్వహించడానికి మన సమయాన్ని, స్వేచ్ఛను, ప్రశాంతతను ఖర్చు చేస్తున్నామన్నమాట!

సోషల్ మీడియా ప్రపంచంలో ఇతరుల జీవనశైలిని చూస్తూ మన జీవితాన్ని పోల్చుకోవడం సాధారణమైపోయింది. ఎవరో విదేశీ పర్యటనకు వెళ్లారని, మరొకరు కొత్త కారు కొన్నారని, ఇంకొకరు విలాసవంతమైన ఇంట్లో ఉంటున్నారని మనమూ అలాంటి జీవితాన్ని కోరుకుంటాం. కానీ సోషల్ మీడియాలో కనిపించేది వారి జీవితంలోని మెరిసే వైపు మాత్రమే. ఆ జీవనశైలి వెనుక ఉన్న అప్పులు, ఆర్థిక ఒత్తిళ్లు, బాధ్యతలు కనిపించవు. అందుకే ఇతరుల విజయాలను చూసి మన అవసరాలను నిర్ణయించుకోవడం తెలివైన పని కాదు. నిజమైన లగ్జరీ అంటే ఖరీదైన కారు కాదు.. అవసరమైనప్పుడు సెలవు తీసుకునే స్వేచ్ఛ. పెద్ద ఇల్లు కాదు.. ఇంటికి తిరిగొచ్చినప్పుడు ప్రశాంతంగా ఉండగలిగే మనసు. బ్యాంకు ఖాతాలో భారీ మొత్తం ఉండటమే కాదు.. అనుకోని సమస్య వచ్చినా భయపడకుండా ఎదుర్కొనే ఆర్థిక భద్రత. ఖరీదైన వస్తువులు కలిగి ఉండటం కంటే వాటి కోసం అప్పుల ఊబిలో చిక్కుకోకుండా ఉండటం గొప్ప విషయం. అందుకే ప్రతి కొనుగోలుకు ముందు ఒకసారి ఆలోచించాలి. ఇది నిజంగా అవసరమా? దీని నిర్వహణ ఖర్చును భరించగలనా? దీని కోసం నా స్వేచ్ఛను తాకట్టు పెట్టాల్సి వస్తుందా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. సంపాదన పెరిగిన ప్రతిసారీ ఖర్చులనూ పెంచుకోవాల్సిన అవసరం లేదు. కొంత మొత్తాన్ని పొదుపు చేయడం, అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం, అప్పులను నియంత్రించడం, అనుభవాలకు ప్రాధాన్యత ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. జీవితం అనేది వస్తువులను కూడబెట్టుకునే పోటీ కాదు. మనకు నచ్చిన పనులు చేసుకుంటూ, ఇష్టమైన వారితో సమయం గడుపుతూ, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించడమే అసలైన విజయం. మనం ఉపయోగించాల్సిన వస్తువులకు బానిసలుగా మారకూడదు. డబ్బు మన జీవితాన్ని సులభతరం చేయాలి కానీ, దాని కోసం జీవితాన్నే కష్టతరం చేసుకోకూడదు. సంపాదించండి.. ఆనందించండి.. భవిష్యత్తు కోసం పొదుపు చేయండి. కానీ సంపాదన అంతా ఖర్చులకే సరిపోతూ, మన కోసం మనకు సమయం మిగలని పరిస్థితిని మాత్రం తెచ్చుకోవద్దు. వస్తువుల కోసం మనం కాదు.. మన కోసం వస్తువులుండాలి!

ఏపీకి తీరని 'తుపాను' కష్టాలు!?

ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి పరీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకవైపు ఆర్నబ్ తుపాను సృష్టించిన బీభత్సం నుంచి తీరప్రాంత ప్రజలు, రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా.. మరోవైపు మురసు తీవ్ర తుపాను ముప్పు ముంచుకొచ్చింది. ఒక తుపాను ప్రభావం పూర్తిగా తొలగకముందే మరో తుపాను విరుచుకుపడే పరిస్థితి రాష్ట్ర ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా జిల్లాలపై మురసు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారిన మురసు నవంబరు 2 ఉదయం నాటికి గంటకు సుమారు 22నుంచి 25 కిలోమీటర్ల వేగంతో వాయవ్య దిశగా కదులుతోంది. భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం (సోమవారం సాయంత్రం 4 గంటలకు) నెల్లూరుకు తూర్పు ఆగ్నేయంగా సుమారు 210 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు ఈశాన్యంగా 200 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. నెల్లూరు నుంచి నర్సాపురం మధ్య, ఒంగోలు సమీపంలో నవంబరు 2 అర్ధరాత్రి నుంచి నవంబరు 3 తెల్లవారుజామున నాలుగు గంటల మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదముంది. తుపాను ప్రభావం దక్షిణ కోస్తాపైనే కాకుండా ఉత్తరాంధ్రలోనూ గాలుల రూపంలో కనిపించే అవకాశం ఉంది. సముద్రం అల్లకల్లోలంగా మారినప్పుడు చిన్న బోట్లు మాత్రమే కాకుండా భారీ నౌకలు సైతం గాలుల దిశకు కొట్టుకుపోయే ప్రమాదముంటుంది. గతంలో విశాఖ తెన్నేటి పార్కు సమీపంలో బంగ్లాదేశ్ నౌక తీరానికి కొట్టుకొచ్చిన ఘటన ఈ ప్రమాదాలకు నిదర్శనం. అందువల్ల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండటం, ఇప్పటికే వేటకు వెళ్లిన వారు సురక్షితంగా తీరానికి చేరుకునేలా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం. తుపాను హెచ్చరికలను తేలికగా తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించే ప్రమాదముంది.


మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదముంది. ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాలు, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లోనూ వర్షాల తీవ్రత ఉండవచ్చు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ వర్షాలు, బలమైన గాలుల ప్రభావం కనిపిస్తోంది. తుపాను ప్రభావం తెలంగాణలోనూ ఉండనుంది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే తీరప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. కృష్ణపట్నం పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. నెల్లూరు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం, తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంవంటి చర్యలు ప్రారంభమయ్యాయి. సహాయక చర్యల కోసం ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం ముందస్తు సన్నద్ధతలో భాగం. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు



చేయడం, అవసరమైన చోట అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచడం కూడా అవసరం. రైలు, విమాన సర్వీసులపైనా తుపాను ప్రభావం పడుతోంది. ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయడం, మరికొన్నింటిని దారి మళ్లించడం జరిగింది. చెన్నై నుంచి విజయవాడ, రాజమండ్రి, కడప తదితర ప్రాంతాలకు వచ్చే కొన్ని విమాన సర్వీసులు కూడా రద్దయ్యాయి. విజయవాడ, రాజమండ్రి, తిరుపతి విమానాశ్రయాల కార్యకలాపాలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. విపత్తులో మరో ముఖ్యమైన అంశం వ్యవసాయం. ఆర్నబ్ తుపాను ప్రభావంతో ఇప్పటికే కృష్ణా జిల్లాలో వరితోపాటు మినుము, వేరుశనగ, పత్తి, చెరకు, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ముంపు నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న రైతులకు మురసు ముప్పు మరింత ఆందోళన కలిగిస్తోంది. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పొలాల్లో ఉన్న ఇతర పంటలకు భారీ వర్షాలు తీవ్ర నష్టం కలిగించవచ్చు. పంటలు నేలకొరిగితే దిగుబడిపై ప్రభావం పడుతుంది. నీరు నిలిచిపోతే వేర్లు కుళ్లిపోయి పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. రైతులకు ముందస్తు హెచ్చరికలు అందించడం, పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకరించడం, నష్టం వాటిల్లిన వెంటనే అంచనాలు వేయడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత.

తుపాన్లను పూర్తిగా నివారించడం మన చేతుల్లో లేకపోయినా, వాటివల్ల కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవడం మాత్రం సాధ్యమే. ఇందుకు ముందస్తు ప్రణాళిక, సమన్వయం, వేగవంతమైన స్పందన అత్యవసరం. ఆంధ్రప్రదేశ్‌కు తుపాన్లు కొత్తకాదు. బంగాళాఖాత తీరంలో ఉన్న రాష్ట్రం కావడంతో ఏటా ఏదోక రూపంలో ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తోంది. హుద్‌హుద్, తిత్లీ, ఫణివంటి తుపాన్ల అనుభవాలు మనకు ఎన్నో పాఠాలు నేర్పాయి. అయినప్పటికీ ప్రతి విపత్తు వచ్చినప్పుడు మళ్లీ అదే సవాళ్లు ఎదురవుతున్నాయంటే వ్యవస్థాగతంగా మరింత మెరుగుదల అవసరం. తీరప్రాంత గ్రామాల్లో ముందస్తు తరలింపు ఏర్పాట్లు, పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచడం, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ముఖ్యం. మత్స్యకారులకు సముద్రంలోకి వెళ్లవద్దన్న హెచ్చరికలు స్పష్టంగా చేరాలి. విద్యుత్, రహదారులు, తాగునీరు, సమాచార వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు తక్షణ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రి, సిబ్బంది సిద్ధంగా ఉండాలి. విపత్తుల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవ ద్వారా విద్యుత్ అంతరాయం, చెట్లు కూలిపోవడం, వరద నీరు చేరడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో 112, విపత్తుల నిర్వహణ కోసం 1070, 1800-425-0101 నంబర్లను వినియోగించుకోవచ్చు.

ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా అధికారిక హెచ్చరికలనే అనుసరించాలి. ఇక తుపాను తీరం దాటిన వెంటనే ప్రమాదం ముగిసినట్లు కాదు. భారీ వర్షాలు, వరదలు, విద్యుత్ అంతరాయాలు, రహదారులపై అడ్డంకులు మరికొంతకాలం కొనసాగవచ్చు. ఆర్నబ్ తర్వాత మురసు రూపంలో ఎదురవుతున్న ప్రకృతి సవాలు రాష్ట్రానికి ఒక హెచ్చరిక. తాత్కాలిక సహాయక చర్యలతో సరిపెట్టకుండా దీర్ఘకాలిక విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలి. తీరప్రాంత రక్షణ, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, పంటల బీమా, విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం ఎంత అప్రమత్తంగా ఉంటుందో, ప్రజలు ఎంత బాధ్యతగా వ్యవహరిస్తారో కూడా నష్ట తీవ్రతను నిర్ణయిస్తాయి. ప్రస్తుతం కావాల్సింది భయాందోళనలు కాదు.. అప్రమత్తత, సమన్వయం, సమర్థవంతమైన కార్యాచరణ. ప్రజల ప్రాణాలను కాపాడటమే తొలి ప్రాధాన్యతగా యంత్రాంగం పనిచేయాలి. ■



ఖాళీ బిందె ఎప్పుడూ ఎక్కువ శబ్దం చేస్తుంది,
నిండు కుండ నిశ్శబ్దంగా ఉంటుంది.
మనుషులూ అంతే. నిజంగా సామర్థ్యం
ఉన్నవారికి తమను నిరూపించుకోవాల్సిన
తొందర ఉండదు, వారి పని మాట్లాడుతుంది.
కానీ లోపల భయం, అభద్రత ఉన్నవారు గొంతు
పెంచి, లేని ధైర్యాన్ని నటిస్తారు. ఆ అరుపులు
చూసి భయపడకండి, అవి బలం కాదు, భయం
చేసే గోల. ఎవరి వెనుక ఎంత కష్టం ఉందో
చూడండి, వారి గొంతు ఎంత పెద్దదో కాదు.

-మహాదేవ

చింతల్లో చింతలు

చేతుల మీద కాదు.. వేళ్ల మీద నడిచే చేయి!



సాధారణంగా మనుషులు చేతులతో పనులు చేస్తారు.. కాళ్లతో నడుస్తారు. కానీ స్విట్జర్లాండ్ పరిశోధకులు ఈ లెక్కనే మార్చేశారు. జ్యూరిచ్‌లోని ఈటీహెచ్ పరిశోధకులు ఐదు వేళ్లను కాళ్లుగా ఉపయోగించుకుంటూ నడిచే రోబోటిక్ చేతిని రూపొందించారు. ఏకంగా 14 రకాల ఉపరితలాలపై పాకుతూ వెళ్లగలిగే ఈ చేయి, పడిపోతే తిరిగి లేచి నిలబడటమే కాదు.. వస్తువులను నెట్టగలదు, కంప్యూటర్ కీబోర్డుపై టైప్ చేయగలదు. 'ఆడమ్స్ ఫ్యామిలీ'లోని థింగ్ గుర్తుకొస్తోంది కదూ! ఇకపై ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు తలుపు కింద నుంచి చేయి వస్తే.. భయపడకండి, అది రోబో కూడా కావచ్చు!

ఆరోగ్యం & జీవనశైలి

• మంచి ఆహారం • ఆరోగ్యకర జీవనం • సంతోషకర కుటుంబం



1



ఆరోగ్య వార్త...

రోజువారీ ఆహారంలో ఈ మార్పులు చేసుకుంటే ఆరోగ్యానికి మేలు!

వివిధ రకాల కూరగాయలు, పండ్లను ఆహారంలో చేర్చుకోండి.

పోషక విలువలున్న సమతుల ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వండి.

రోజుకు తగినన్ని నీళ్లు తాగండి, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచండి.

వ్యాయామం అలవాటు చేసుకోండి, బరువును నియంత్రించండి.

2



వంటకాల ప్రత్యేకం

చుక్కకూర పచ్చడి.. అన్నంలో కలుపుకుంటే రుచికి రుచే!

తాజా చుక్కకూరతో రుచికరమైన పచ్చడి.

వెల్లుల్లి, మిరపకాయలు, నువ్వులు, తగినంత ఉప్పుతో అద్భుతమైన రుచి.

ఆంధ్రా స్టైల్‌లో సులభంగా ఇంట్లో తయారు చేసుకోవచ్చు.

అన్నం, దోసె, ఇడ్లీ, రొట్టెలతో ఎంతో బాగుంటుంది.

3



కుటుంబం

పిల్లలతో ప్రతిరోజూ కొంత సమయం గడపండి.. తల్లిదండ్రులకు నిపుణుల సూచనలు!

పిల్లలతో ఎక్కువ సమయం మాట్లాడండి.

వారి భావాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి.

మొబైల్, టీవీకి సమయం తగ్గించి కుటుంబంతో గడపండి.

కలిసి భోజనం చేయడం మంచి అలవాటు.

4



ఆరోగ్య హెచ్చరిక

విటమిన్ డి లోపిస్తే గుండె కణాలపై ప్రభావం.. హైదరాబాద్ NIN అధ్యయనంలో కీలక విషయాలు!

- విటమిన్ డి లోపం గుండె కణాల్లో ఒత్తిడిని పెంచుతుందని అధ్యయనంలో వెల్లడైనట్లు డిజైన్‌లో పేర్కొన్నారు.
- గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం.
- ఉదయపు సూర్యకిరణాలు, పోషకాహారం ద్వారా విటమిన్ డి పొందండి.
- వైద్యుల సూచనలతో పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోండి.

5



విద్యార్థుల ఆహారంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి.. తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన విషయాలు!

పిల్లల ఆరోగ్యం

- పిల్లలకు సమతుల ఆహారం అందించండి.
- అధిక చక్కెర, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండేలా చూడండి.
- ప్రతిరోజూ పాలు, పండ్లు, ప్రోటీన్ ఆహారాలు ఇవ్వండి.
- శుభ్రత పాటిస్తూ, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచండి.

రోహిత్ వర్సెస్ కోహ్లీ: ఎవరు సెంచరీ చేస్తారు? పుజారా అంచనా ఇదే..!

- కోహ్లీకి సెంచరీ అవకాశాలు ఎక్కువన్న పుజారా
- మూడో స్థానంలో బ్యాటింగ్ కోహ్లీకి కలిసొస్తుందని వ్యాఖ్య
- న్యూజిలాండ్‌లో రోహిత్ పాత్ర మారొచ్చని అంచనా
- ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని జోస్యం
- న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యం ఉంటుందని అభిప్రాయం



న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ కంటే విరాట్ కోహ్లీకి సెంచరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లీ మూడో స్థానంలో రావడం అతడికి ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే అవకాశం కల్పిస్తుందని చెప్పాడు. అదే సమయంలో ఓపెనర్‌గా రోహిత్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుందని, న్యూజిలాండ్ పిచ్‌లపై అతడి పాత్రలో మార్పు ఉండొచ్చని పేర్కొన్నాడు.

జియోస్టార్‌తో మాట్లాడిన పుజారా.. "రోహిత్ సాధారణంగా పవర్‌ప్లేలో జట్టుకు మంచి ఆరంభం అందించడంపై దృష్టి పెడతాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో అతడి పాత్ర మారవచ్చు. అయితే కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. ఇన్నింగ్స్‌ను నిలబెట్టి ఆడటం అతడి ఆటతీరులో కీలకం. ఈ స్థానంలో వచ్చే బ్యాటర్‌కు వన్డేల్లో సెంచరీ చేసే అవకాశం కొంత ఎక్కువగా ఉంటుంది. అందుకే రోహిత్ కంటే కోహ్లీకి శతకం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నా" అని వివరించాడు. ఈ సిరీస్ హోరాహోరీగా సాగుతుందని పుజారా అంచనా వేశాడు.

ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని, వర్షం కారణంగా ఓ మ్యాచ్ రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆడే భారత జట్టు, చివరి రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగే జట్టు వేరుగా ఉండనుండటం న్యూజిలాండ్‌కు కొంత అనుకూలిస్తుందని అభిప్రాయపడ్డాడు. అయితే తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు మెరుగ్గా రాణిస్తుందని పుజారా విశ్వాసం వ్యక్తం చేశాడు. చివరి రెండు మ్యాచ్‌లు టీమిండియాకు కొంత సవాలుగా మారవచ్చని అన్నాడు. న్యూజిలాండ్‌లో వర్షాలు కూడా మ్యాచ్‌ల ఫలితాలపై ప్రభావం చూపవచ్చని పేర్కొన్నాడు.

దిగ్గజ జట్లకు షాక్.. వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్
- తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు
- శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం
- వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్
- ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

టీమిండియా కోచ్‌గా మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నా.. గంభీర్ కీలక వ్యాఖ్యలు



టీమిండియా హెడ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వహించడం అంత సులభం కాదు. ప్రతి మ్యాచ్‌లో గెలవాలనే అంచనాలు.. ఆటగాళ్ల ఎంపికలో సవాళ్లు.. వరుస పర్యటనలు.. ఇలా నిరంతరం ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో తాను కూడా కొన్నిసార్లు మానసికంగా అలసిపోతున్నానని భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరించాడు. అయితే ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తనకు ఉందని స్పష్టం చేశాడు. న్యూజిలాండ్‌తో ఐదో టీ20 ముగిసిన అనంతరం మీడియాతో గంభీర్ మాట్లాడాడు. మూడు ఫార్మాట్లకు ఒకేసారి కోచ్‌గా వ్యవహరించడం సవాలుతో కూడుకున్నదని చెప్పాడు. ముఖ్యంగా వరుస పర్యటనలు, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య తగినంత విరామం లేకపోవడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపాడు. భారత జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు ప్రతి మ్యాచ్ గెలవాలనే అంచనాలు ఉంటాయని పేర్కొన్నాడు. "నిజం చెప్పాలంటే.. నేను కూడా మానసికంగా అలసిపోయిన సందర్భాలున్నాయి. కానీ ఆ ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి నాకుంది. సాధ్యమైనంత కాలం దాన్ని భరిస్తాను. ఒత్తిడిని తట్టుకోగలను. అవసరమైతే బుల్లెట్‌ను కూడా ఎదుర్కొంటాను. నేనూ మనిషినే. కొన్నిసార్లు అలసట తప్పదు. అయితే ఇప్పటివరకు ఆ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నా" అని గంభీర్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడినప్పటికీ తొలి మూడు మ్యాచుల్లో విజయం సాధించడం గొప్ప విషయమని గంభీర్ అన్నాడు. న్యూజిలాండ్‌కు చేరుకున్న తర్వాత ఆటగాళ్లకు కేవలం ఒక్కరోజు మాత్రమే సాధనకు అవకాశం లభించిందని గుర్తుచేశాడు. భిన్నమైన వాతావరణం, మైదాన పరిస్థితుల్లోనూ జట్టు అద్భుతంగా ఆడిందని ప్రశంసించాడు. ఈ విజయానికి ఆటగాళ్లే పూర్తి క్రెడిట్ తీసుకోవాలని చెప్పాడు. 2026లో ఇప్పటివరకు భారత జట్టుతో కలిసి 12 సిరీస్‌లలో గంభీర్ కోచ్‌గా వ్యవహరించాడు. మూడు ఫార్మాట్ల బాధ్యతలు ఒకేసారి నిర్వహిస్తుండటంతో విశ్రాంతికి పెద్దగా అవకాశం దక్కడం లేదు. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల తర్వాత రెండు టెస్టుల సిరీస్ కూడా జరగనుంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లకు తగినంత సన్నద్ధత సమయం కల్పించడం ముఖ్యమని గంభీర్ అభిప్రాయపడ్డాడు.

శ్రద్ధా కపూర్ ట్రెడిషనల్ లుక్ అదుర్స్.. ఆభరణాలే స్పెషల్ అట్రాక్షన్!



ముదురు ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ చీరలో సోనం బజ్వా అద్భుతంగా కనిపిస్తున్నారు

బాలీవుడ్ అందాల భామ శ్రద్ధా కపూర్ తన సహజమైన నవ్వుతో, ముచ్చటైన సంప్రదాయ లుక్స్‌తో ఎంతోమంది అభిమానుల హృదయాలను కొల్లగొడుతుంటారు. తాజాగా ఈ పండుగ వేడుకలో పర్పుల్ అండ్ మెజెంటా కాంబినేషన్‌లోని పట్టు చీరను ధరించి, నిండైన భారతీయ నారీమణిలా మెరిసిపోయారు. పద్ధతైన లుక్‌లో కనిపిస్తున్న శ్రద్ధా ధరించిన అవుట్‌ఫిట్, ఆభరణాల ప్రైస్ బ్రేక్‌డౌన్‌తో పాటు ఆమె నటిస్తున్న లేటెస్ట్ సినిమా విశేషాలు ఇప్పుడు సరళంగా చూద్దాం..

పర్పుల్ సిల్క్ శారీ అండ్ డిజైనర్ గాజులు:

ఈ ట్రెడిషనల్ లుక్ కోసం శ్రద్ధా కపూర్ రాయల్ పర్పుల్ రంగులో ఉన్న పట్టు చీరను ఎంచుకున్నారు. ఈ చీరకు ఉన్న రిచ్ మెజెంటా కలర్ బార్డర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పర్పుల్ సిల్క్ శారీ అంచనా ధర సుమారు రూ. 25,000గా ఉంది. ఇక దీనికి తోడుగా చేతులకు ధరించిన 'గ్రీన్ ఁ గోల్డ్ బ్యాంగిల్స్ సెట్' రూ. 6,000 ఆమె సంప్రదాయ లుక్‌కి మరింత శోభను తెచ్చిపెట్టింది.

గోల్డ్ చోకర్ అండ్ ట్రెడిషనల్ ఆభరణాలు:

ఈ చీరకు పర్‌ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా శ్రద్ధా క్లాసీగా ఉండే సాంప్రదాయ బంగారు ఆభరణాలను ధరించారు. మెడలో వేసుకున్న గోల్డ్-టోన్డ్ చోకర్ నెక్లెస్ అంచనా ధర రూ. 8,000 కాగా, ట్రెడిషనల్ గోల్డ్ జుంకా ఇయర్ రింగ్స్ ధర సుమారు రూ. 12,000గా ఉంది. అలాగే కాళ్లకు గోల్డ్ పట్టీలు రూ. 3,000 మరియు ఎంబెల్లిష్డ్ జుత్తీ ఫ్లాట్స్ రూ. 5,000 ధరించి ఎంతో పద్ధతిగా, దేవకన్యలా మెరిసిపోయారు.


లావణి నృత్యం నేపథ్యంలో 'ఈథా' సినిమా:

గ్లామర్ పాత్రలతోనే కాకుండా వైవిధ్యమైన కథలతో అలరించే శ్రద్ధా కపూర్, ఇప్పుడు మహారాష్ట్ర సంప్రదాయ నృత్యకళ లావణి నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఈథా' అనే బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణి కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణ్‌గావ్కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రద్ధా కళాకారులతో కలిసి వేసిన లావణి డాన్స్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం.. నానా పటేకర్ కీలక పాత్ర:

దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మద్దాక్ ఫిల్మ్స్ మరియు కత్పుత్లీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో శ్రద్ధా 'ఈథా బాయి' పాత్రలో అలరించనుండగా, దివంగత నటుడు నానా పటేకర్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఇక ప్రభాస్ సరసన 'సాహో' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన శ్రద్ధా, ఈ బయోపిక్ చిత్రంతో బాలీవుడ్‌లో మరో భారీ హిట్‌ను తన ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇక మొత్తానికి చూస్తే, ఎక్కువ హంగులు లేకుండానే నిండైన పట్టు చీర, సాంప్రదాయ ఆభరణాలతో శ్రద్ధా కపూర్ చూపించిన ఈ క్లాసీ ఎలిగంట్ లుక్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు సంప్రదాయ ఫ్యాషన్ సెన్స్‌తో అలరిస్తూనే, మరోవైపు 'ఈథా' వంటి వైవిధ్యమైన సినిమాలతో శ్రద్ధా బాలీవుడ్‌లో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.





లీగల్ జర్దోజీ లెహంగా లుక్‌లో చెత్నా పాండే స్టన్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965